RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 4 సంచిక : 14 బుధవారం 11 ఫిబ్రవరి 2026 పేజీలు : 4 వెల : రూ. 2.00

### బంగ్లాదేశ్ ఎగుమతులు భారత్ నుంచి వెళ్లకుండా నిషేధం

న్యూఢిల్లీ : భారత భూభాగం గుండా నేపాల్, భూటాన్, మయన్మార్ దేశాలకు సరుకులు ఎగుమతి చేసుకునేలా బంగ్లాదేశ్‌కు గతంలో ఇచ్చిన వెసులు బాటు(ట్రాన్స్‌షిపమెంట్)ను కేంద్రప్రభుత్వం రద్దు చేసింది. బంగ్లాదేశ్ ఎగుమతులేవీ భారతదేశం గుండా వేరే దేశాలకు వెళ్లకుండా పూర్తిగా నిషేధం విధించింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. బంగ్లాదేశ్‌కు ట్రాన్స్‌షిపమెంట్ వెసులుబాటు కల్పిస్తూ 2020 జూన్ 29న భారత్ సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం.. బంగ్లాదేశ్ తమ ఉత్పత్తులను భారత్‌లోని ల్యాండ్ కస్టమ్స్ స్టేషన్లు, నౌకాశ్రయాలు, ఎయిర్‌పోర్టుల ద్వారా వేరే దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చు.

# పట్టణ సమరం: ప్రధాన పార్టీలకు కీలక పరీక్షా సమయం



## మున్సిపల్ సమరం: అభివృద్ధి వర్సెస్ అసంతృప్తి

మున్సిపల్ ఎన్నికలు స్థానిక ప్రజాస్వామ్యానికి అద్దం పట్టే కీలక ప్రక్రియ. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీలు ఎంత ముఖ్యమో, పట్టణ జీవన విధానాన్ని తీర్చిదిద్దడంలో మున్సిపాలిటీలు అంతకన్నా కీలక పాత్ర పోషిస్తాయి. నీటి సరఫరా నుంచి మురుగు పారుదల వరకు, రోడ్ల నుంచి వీధి దీపాల వరకు, పట్టణ ప్రణాళిక నుంచి ప్రజా ఆరోగ్యం వరకు---ప్రతి అంశం మున్సిపల్ పాలనతో ముడిపడి ఉంటుంది. అందుకే మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక ప్రతినిధుల ఎంపిక మాత్రమే కాదు; రాష్ట్ర స్థాయి రాజకీయ సమీకరణాలకు, ప్రజాభిప్రాయ ధోరణులకు సూచికలుగా కూడా పరిగణించ బడతాయి. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీల అవకాశాలు, ఫలితాల సాధ్యాసాధ్యాలు, వాటిపై ప్రభావం చూపే కారకాలు విశ్లేషణకు వస్తాయి. పూర్వాపరాలను పరిశీలిస్తే, మున్సిపల్ ఎన్నికలు సాధారణంగా రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని ప్రతిబింబించే స్వభావం కలిగి ఉంటాయి. గత రెండు దశాబ్దాల ఎన్నికల ధోరణులను పరిశీలించినప్పుడు ఒక స్పష్టమైన లక్షణం కనిపిస్తుంది: అధికారంలో ఉన్న పార్టీకి పట్టణాల్లో మిశ్రమ ఫలితాలు రావడం. కొన్ని సందర్భాల్లో అధికార పార్టీ తన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఆధారంగా పట్టణ ఓటర్లను ఆకర్షిస్తే, మరికొన్ని సందర్భాల్లో స్థానిక సమస్యలు, అభివృద్ధి లోపాలు ప్రతిపక్షానికి అవకాశాన్ని కల్పిస్తాయి. సాధారణంగా పట్టణ ఓటర్లు అభివృద్ధి, పారదర్శకత, సేవల నాణ్యత వంటి అంశాలపై ఎక్కువ దృష్టి పెడతారని ఎన్నికల విశ్లేషకులు చెబుతుంటారు. గణాంక పరంగా చూస్తే, మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం సాధారణంగా 55 నుంచి 75 శాతం మధ్య ఊగిస లాడుతుంది. పెద్ద నగరాల్లో ఓటింగ్ కొంత తక్కువగా ఉండగా, చిన్న పట్టణాల్లో ఎక్కువగా నమోదవుతుంది. ఇది పట్టణ ప్రజల రాజకీయ చైతన్యం, స్థానిక సమస్యల తీవ్రత, పార్టీ స్థాయి నిర్వహణ వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. గత ఎన్నికల్లో అనేక పట్టణాల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఫలితాలు మారిన ఉదాహరణలు ఉన్నాయి. ఇది మున్సిపల్ ఎన్నికల్లో బూత్ స్థాయి నిర్వహణ, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం ఎంత కీలకమో చూపిస్తుంది. ప్రధాన పార్టీల అవకాశాలను విశ్లేషించినప్పుడు మొదట అధికార పార్టీ స్థితిని పరిశీలించాలి. అధికార పార్టీకి పరిపాలనా అనుభవం, వనరుల సమీకరణ, సంక్షేమ పథకాల ప్రచారం వంటి ప్రయోజనాలు ఉంటాయి. పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారి నిర్మాణం, డ్రైనేజీ, స్మార్ట్ సిటీ తరహా ప్రాజెక్టులు అమలు చేసినట్లయితే అవి ఎన్నికలలో ప్రచార ఆయుధాలుగా మారుతాయి. అయితే అదే సమయంలో పట్టణాల్లో ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలు, మురుగు పారుదల లోపాలు, ఆస్తి పన్నుల పెంపు, నీటి సరఫరా లోపాలు వంటి అంశాలు ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. అందువల్ల అధికార పార్టీ అవకాశాలు అభివృద్ధి-అసంతృప్తి మధ్య సమతుల్యతపై ఆధారపడి ఉంటాయి. ప్రధాన ప్రతిపక్ష పార్టీకి మున్సిపల్ ఎన్నికలు ఒక అవకాశ వేదిక. పట్టణ సమస్యలను ఎత్తిచూపడం, స్థానిక అసంతృప్తిని సమీకరించడం, ప్రత్యామ్నాయ పరిపాలనా దృష్టికోణాన్ని ప్రజల ముందుంచడం ద్వారా ప్రతిపక్షం తన బలాన్ని చాటుకోవచ్చు. ముఖ్యంగా యువ ఓటర్లు, మధ్యతరగతి వర్గాలు, చిన్న వ్యాపారులు వంటి వర్గాల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుంటే ప్రతిపక్షానికి ఊతం లభిస్తుంది. గత ఎన్నికల అనుభవం చెబుతున్నది ఏమిటంటే--పట్టణాల్లో ప్రతిపక్షం సాధారణంగా వార్డు స్థాయిలో బలమైన అభ్యర్థులను నిలబెట్టగలిగితే ఫలితాల్లో గణనీయమైన మెరుగుదల సాధ్యమవుతుంది. మూడో శక్తులు, ప్రాంతీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా మున్సిపల్ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తారు. అనేక పట్టణాల్లో వ్యక్తిగత ప్రభావం, స్థానిక సామాజిక సమీకరణాలు, వృత్తి సంఘాల మద్దతు వంటి అంశాల ఆధారంగా స్వతంత్రులు విజయం సాధించిన సందర్భాలు ఉన్నాయి. కొన్ని చోట్ల త్రికోణ పోటీలు ఫలితాలను అనూహ్యంగా మార్చేస్తాయి. ఓట్ల విభజన ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేస్తుంది. అందువల్ల చిన్న పార్టీల ప్రదర్శన కూడా మొత్తం రాజకీయ సమీకరణంలో కీలకంగా మారుతుంది. అభ్యర్థుల ఎంపిక మున్సిపల్ ఎన్నికల్లో అత్యంత కీలక అంశం. స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండే, సమస్యలపై అవగాహన కలిగిన, సామాజికంగా అంగీకారం పొందిన అభ్యర్థులను ఎంపిక చేసిన పార్టీకి ఆధిక్యం లభించే అవకాశాలు ఎక్కువ. కుటుంబ ఆధారిత లేదా వర్గ రాజకీయాలు కొన్ని ప్రాంతాల్లో ప్రభావం చూపినా, పట్టణ ఓటర్లు క్రమంగా పనితీరు ఆధారంగా నిర్ణయం తీసుకునే ధోరణి పెరుగుతోందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. ప్రచార వ్యూహాలు కూడా ఫలితాలపై ప్రభావం చూపుతాయి. సంప్రదాయ డోర్-టు-డోర్ ప్రచారం, సామాజిక మాధ్యమాల వినియోగం, స్థానిక సమస్యలపై చర్చలు-ఇవి అన్నీ కలిపి ఓటర్లపై ప్రభావం చూపుతాయి. పట్టణాల్లో డిజిటల్ ప్రచారం ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ, ప్రత్యక్ష సంప్రదింపులు ఇంకా కీలకమే. ముఖ్యంగా మహిళా ఓటర్లు, యువత, వృద్ధులు వంటి వర్గాల ప్రత్యేక అవసరాలను గుర్తించి ప్రచారం నిర్వహించిన పార్టీకి అదనపు మద్దతు లభించే అవకాశం ఉంది. సామాజిక-ఆర్థిక అంశాలు కూడా మున్సిపల్ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాయి. పట్టణ ఉపాధి అవకాశాలు, ధరల పరిస్థితి, చిన్న వ్యాపారాల స్థితి, రియల్ ఎస్టేట్ అభివృద్ధి, పన్నుల విధానం వంటి అంశాలు ఓటర్ల నిర్ణయంపై ప్రభావం చూపుతాయి. పట్టణ పేదలు సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెడితే, మధ్యతరగతి మౌలిక సదుపాయాలు, పారదర్శక పరిపాలనపై ఆసక్తి చూపుతుంది. ఈ విభిన్న అంచనాలను సమతుల్యం చేసే పార్టీకి ఎన్నికల్లో ప్రయోజనం కలుగుతుంది. ఫలితాల అంచనాల విషయానికి వస్తే, మున్సిపల్ ఎన్నికలు సాధారణంగా మిశ్రమ తీర్పును ఇస్తాయి. కొన్ని పట్టణాల్లో అధికార పార్టీ ఆధిక్యం సాధిస్తే, మరికొన్నింటిలో ప్రతిపక్షం బలంగా ఎదగడం సాధారణం. ఓట్ల శాతం స్వల్పంగా మారినా వార్డు ఫలితాలు గణనీయంగా మారే అవకాశం ఉంది. కూటములు, స్థానిక అవగాహనలు, చివరి దశ ప్రచారం-ఇవి అన్నీ తుది ఫలితాన్ని ప్రభావితం చేస్తాయి. అనేక సందర్భాల్లో హంగ్ కౌన్సిల్స్ ఏర్పడటం కూడా మున్సిపల్ రాజకీయాల్లో సాధారణమే; తద్వారా ఎన్నికల అనంతర పొత్తులు కీలకమవుతాయి. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాలకు సంకేతాలుగా కూడా పరిగణించబడతాయి. పట్టణాల్లో ఏ పార్టీకి ప్రజాభిమానం పెరుగుతోందో, ఏ వర్గాలు మార్పు కోరుకుంటున్నాయో ఈ ఎన్నికలు సూచిస్తాయి. అందువల్ల ప్రధాన పార్టీలు వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని వ్యూహాత్మకంగా పోరాడుతాయి. ఎన్నికల అనంతరం ఫలితాల విశ్లేషణ పార్టీలు తమ బలహీనతలను గుర్తించేందుకు, భవిష్యత్ వ్యూహాలను సవరించేందుకు ఉపయోగపడుతుంది. మొత్తంగా చూస్తే, మున్సిపల్ ఎన్నికలు స్థానిక సమస్యలు, అభివృద్ధి పనితీరు, అభ్యర్థుల వ్యక్తిత్వం, పార్టీ వ్యూహాలు, సామాజిక సమీకరణాలు-ఈ అన్నింటి సమ్మేళనం. ప్రధాన పార్టీల అవకాశాలు ఈ అంశాలను ఎంత సమర్థంగా సమన్వయం చేసుకుంటాయన్నదానిపై ఆధారపడి ఉంటాయి. ఫలితాలు ఏవైనా కావొచ్చు, పట్టణ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రక్రియగా ఈ ఎన్నికలు కీలకమైన మైలురాయిగా నిలుస్తాయి. ప్రజల తీర్పు స్థానిక పాలనకు దిశానిర్దేశం చేస్తూ, భవిష్యత్ అభివృద్ధి ప్రాధాన్యతలను నిర్ధారిస్తుంది. ఇదే మున్సిపల్ ఎన్నికల అసలైన ప్రజాస్వామ్య సారాంశం.

## స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం.. లోక్‌సభలో జరిగేది ఇదే




లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి ప్రతిపక్షం సిద్ధమైంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రసంగానికి అనుమతించనందుకు, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై చర్యలు తీసుకోనందుకు నిరసనగా స్పీకర్‌పై ఓం బిర్లాపై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైంది. మరి ఈ అవిశ్వాస తీర్మానానికి సంబంధించి నియమనిబంధనలు ఏమిటో ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(సీ) కింద లోక్‌సభ స్పీకర్ లేదా డిప్యూటీ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టొచ్చు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదిస్తే స్పీకర్, లేదా డిప్యూటీ స్పీకర్ తమ పదవిని కోల్పోతారు. ఈ తీర్మానానికి సంబంధించి కనీసం 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. లోక్‌సభ కార్యకలాపాల నిబంధనల ప్రకారం, లోక్‌సభ ఎంపీ ఎవరైనా ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టొచ్చు. ఇందుకోసం లిఖిత పూర్వకంగా లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌కు ముందస్తు నోటీసు ఇవ్వాలి. ఆ తరువాత సభలో నిర్వహించాల్సిన కార్యకలాపాల జాబితాలో ఈ తీర్మానాన్ని చేరుస్తారు. దీనిపై చర్చకు ఒక తేదీని కేటాయిస్తారు. ప్రస్తుతం ఈ తేదీని డిప్యూటీ స్పీకర్ నిర్ణయించనున్నారు. ఇక నిర్ణీత తేదీన లోక్‌సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ఆ సమయంలో సభలో ఉన్న కనీసం 50 మంది ఎంపీలు తీర్మానికి మద్దతు తెలిపితేనే ఓటింగ్‌కు మార్గం సుగమం అవుతుంది. లేకపోతే ఆదిలోనే ఇది వీగిపోతుంది. తీర్మానాన్ని సభ ఓటింగ్‌కు స్వీకరించాక ఎంపీలు మూజువాణీ ఓటు ద్వారా లేదా ఇతర ప్రత్యామ్నాయ ఓటింగ్ విధానాల్లో తమ అభిప్రాయాన్ని తెలియజేస్తారు. అసలు ఈ తీర్మానం సభ ముందుకు వచ్చే అర్హత ఉందా? లేదా? అనే అంశం కూడా సంక్లిష్టమైనదని నిపుణులు చెబుతున్నారు. ప్రతిపక్షాల తీర్మానం కొన్ని నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే డిప్యూటీ స్పీకర్ దాన్ని స్వీకరిస్తారు. అంటే ఎలాంటి సాంకేతిక, ఇతరత్రా లోపాలు ఉండకూడదు. తీర్మానంలో ప్రతిపక్షాలు పేర్కొన్న ఆరోపణలు స్పష్టంగా ఉండాలి. సభ్యుల వాదనలు, అభిప్రాయాలు, అన్వయాలు, అవమానకరంగా ఉండే వ్యాఖ్యలకు అవిశ్వాస తీర్మానంలో చోటు ఉండదు. ఇందుకు అనుగుణంగా ఉన్న తీర్మానాన్నే డిప్యూటీ స్పీకర్ స్వీకరిస్తారు. ఇక ఓటింగ్ రోజున సభలో ఉన్న మెజారిటీ ఎంపీలు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటువేస్తేనే ప్రతిపక్షాల లక్ష్యం నెరవేరుతుంది. ప్రస్తుతం బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ కూటమికి 293 ఎంపీల మద్దతు ఉంది. ప్రతిపక్ష ఐఎన్‌డీఐఏ కూటమిలో 238 ఎంపీలే ఉన్నారు. దీంతో, అవిశ్వాస తీర్మానంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

## మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం మాదే



ఖమ్మం : రాష్ట్రంలో రేపు జరుగనున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ఆయన ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల ముందుంచే ప్రయత్నం చేశారు.

**కాంగ్రెస్ విజయం తథ్యం...** రాష్ట్రవ్యాప్తంగా రేపు జరగనున్న 116 మున్సి పాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 శాతం స్థానాలను కైవసం చేసుకుంటుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. గడిచిన రెండేళ్లలో ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చామని, అందుకే ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను దీవించబోతున్నారని ఆయన పేర్కొన్నారు.

**ఆర్థిక క్రమశిక్షణ – ప్రజా సంక్షేమం...** గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని 8 లక్షల 19 వేల కోట్ల అప్పుల్లో ముంచిందని పొంగులేటి విమర్శించారు. ప్రస్తుతం నెలకు 6,300 కోట్ల రూపాయలు కేవలం అప్పుల జమకే కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమం కుంటుపడకుండా చూస్తున్నామన్నారు. వరి వేస్తే ఉరి అనిన కాలం పోయి, నేడు మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తున్నామని గుర్తుచేశారు. విద్యార్థుల కోసం డైట్, కాస్మెటిక్ ఛార్జీల పెంపుతో పాటు ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు.

**సీఎం రేసులో లేను....** ప్రతిపక్ష నేతలు అసభ్య పదజాలంతో హీనంగా మాట్లాడుతున్నారని, వారికి ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని పొంగులేటి మండిపడ్డారు.

తాను సీఎం రేసులో లేనని, కేవలం కాంగ్రెస్ పార్టీలో ఒక సామాన్య కార్యకర్తను మాత్రమేనని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# మున్సి 'పోల్' సిత్రాలు చూడతరమా!?

## చైర్మన్ కుర్చీ కోసం రిసార్ట్ పాలిటిక్స్..

## మేయర్ పీఠానికై.. కోట్లు కుమ్మరిస్తున్న నేతలు.!!




తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. రేపు పోలింగ్ జరుగనుండగా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గల్లీ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకు అందరి దృష్టి ఇప్పుడు పట్టణ పీఠాలపైనే ఉంది. ముఖ్యంగా మున్సిపల్ చైర్మన్, మేయర్ పదవులను దక్కించుకోవడానికి ఆశావహులు అనుసరిస్తున్న వ్యూహాలు, చేస్తున్న ఖర్చు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కొన్ని మున్సిపాలిటీల్లో ఈ గౌరవప్రదమైన కుర్చీల విలువ అక్షరాలా కోట్ల రూపాయల పలుకుతుండటం గమనార్హం. సాధారణ వార్డు మెంబర్‌గా గెలవడం ఒక ఎత్తైతే, ఆపై మున్సిపల్ చైర్మన్‌గా లేదా మేయర్‌గా ఎంపికవ్వడం మరో ఎత్తు. పరోక్ష పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల్లో విజయం సాధించడానికి అవసరమైన మద్దతును కూడగట్టుకునేందుకు అభ్యర్థులు భారీగా వెచ్చిస్తున్నారు. అధికార పార్టీలో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, అధిష్టానం వద్ద తమ పలుకుబడిని పెంచుకోవడమే కాకుండా, తోటి కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకునేందుకు కోట్ల రూపాయల ప్యాకేజీలను ఆఫర్ చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో వినపడుతోంది. పదవి దక్కితే వచ్చే అధికారం, కాంట్రాక్టులు, స్థిరాస్తి వ్యాపారాల్లో దక్కే ప్రయోజనాల దృష్ట్యా ఈ స్థాయి ఖర్చును ఒక పెట్టుబడిగా నేతలు భావిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే గెలిచిన అభ్యర్థులు 'జంపింగ్' కాకుండా ఉండేందుకు ప్రధాన పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరలేపాయి. తమ పార్టీ గుర్తుపై గెలిచిన వారిని, అలాగే స్వతంత్ర అభ్యర్థులను ఇతర పార్టీలు ప్రలోభపెట్టకుండా గోవా, బెంగళూరు వంటి సుదూర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ఒక్కో ఓటుకు లక్షల రూపాయలతో పాటు ఇతర విలాసవంతమైన ఆఫర్లు కూడా ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తం ప్రక్రియలో ప్రజాస్వామ్యం కంటే ధన బలమే ఎక్కువగా కనిపిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. మేయర్, చైర్మన్ ఎన్నికల్లో కేవలం గెలిచిన కౌన్సిలర్లే కాకుండా, ఆ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు 'ఎక్స్-అఫీషియో' సభ్యులుగా ఓటు వేసే అవకాశం ఉంటుంది. మెజారిటీకి అతి సమీపంలో ఉన్న చోట్ల ఈ ఓట్లు అత్యంత కీలకం కానున్నాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యేల మద్దతు కోసం ఆశావహులు వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొన్ని చోట్ల ఎమ్మెల్యేలే తమకు నచ్చిన వారికి పదవి కట్టబెట్టేందుకు చక్రం తిప్పుతుండటంతో, సాధారణ కౌన్సిలర్ల కంటే ఎక్స్-అఫీషియో సభ్యులకే ప్రాధాన్యత పెరిగింది.

మరోవైపు, 50 శాతం రిజర్వేషన్లు మహిళలకు కేటాయించడంతో, పాత నేతలు తమ భార్యలను లేదా కుటుంబ సభ్యులను బరిలోకి దించి తెరవెనుక పాలన సాగించాలని ప్లాన్ చేస్తున్నారు. దీనివల్ల పోటీ మరింత తీవ్రంగా మారింది. ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఫలితాలు రానుండగా, అసలైన ఉత్కంఠ మాత్రం ఫిబ్రవరి 16న జరిగే మేయర్, చైర్మన్ల పరోక్ష ఎన్నిక రోజే నెలకొననుంది. అప్పటివరకు ఈ 'కోట్ల' కుర్చీ లాటరీ కొనసాగుతూనే ఉంటుంది.

# సంపాదకీయం

## పాకిస్తాన్‌లో వ్యాక్సిన్ సంక్షోభం.. భారత్ తో పెట్టుకుంటే అట్లుంటదీ

ఒక దేశపు భవిష్యత్తు ఆ దేశపు సరిహద్దుల వద్ద ఉండే ఆయుధాల మీద మాత్రమే కాదు... ఆ దేశ పౌరుల ఆరోగ్య స్థితిగతులపై కూడా ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం మన పొరుగు దేశమైన పాకిస్తాన్‌ను చూస్తుంటే ఈ మాట అక్షర సత్యమనిపిస్తుంది. రాజకీయ విద్వేషాలు, సైనిక ప్రాధాన్యతలు ఒక దేశ ప్రజల ప్రాణాలను ఎలా ఫణంగా పెడతాయో చెప్పడానికి పాకిస్తాన్‌లో ముంచుకొస్తున్న వ్యాక్సిన్ సంక్షోభమే నిదర్శనం. భారత్ దూరం.. భారమైన భారం ప్రపంచ వ్యాక్సిన్ అవసరాల్లో 60 శాతానికి పైగా తీరుస్తూ 'గ్లోబల్ వ్యాక్సిన్ పవర్‌హౌస్'గా భారత్ ఎదిగింది. సీరం ఇన్‌స్టిట్యూట్, భారత్ బయోటెక్ వంటి సంస్థలు అందించే చౌకైన వ్యాక్సిన్లే పాకిస్తాన్ వంటి పేద దేశాలకు శ్రీరామరక్ష. అయితే 2025లో జరిగిన 'ఆపరేషన్ సింధూర్' తదితర పరిణామాల వల్ల భారత్ నుండి వ్యాక్సిన్ సరఫరా నిలిచిపోవడం పాక్ ఆరోగ్య వ్యవస్థపై పిడుగులా పడింది. ఇప్పటి వరకు ఏడాదికి వి40 మిలియన్లుగా ఉన్న ఇంపోర్ట్ బిల్లు, భారత్ నుండి సప్లై లేకపోవడం వల్ల రాబోయే కాలంలో వి1.2 బిలియన్లకు (సుమారు ?10,000 కోట్లు) చేరుతుందని అంచనా. వైఫల్యాల సుడిగుండంలో పాకిస్తాన్ పాకిస్తాన్ ఎదుర్కొంటున్న సమస్య కేవలం నిధుల కొరత మాత్రమే కాదు, వ్యవస్థాగత వైఫల్యం కూడా.. దశాబ్దాలుగా రక్షణ రంగంపై పెట్టిన శ్రద్ధలో పదో వంతు కూడా ఆరోగ్య రంగంపై పెట్టకపోవడంతో కనీసం ఒక చిన్న వ్యాక్సిన్‌ను కూడా సొంతంగా తయారు చేసుకునే స్థితిలో ఆ దేశం లేదు. మీజిల్స్ కేసులు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన పరిమితి కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉండటం.. ఏడాదికి 90 వేల మందికి పైగా చిన్నారులు న్యూమోనియాతో చనిపోతుండటం ఆ దేశ పాలకుల వైఫల్యానికి అద్దం పడుతోంది. ప్రపంచమంతా పోలియో రహితంగా మారుతుంటే పాకిస్తాన్ ఇంకా ఆ మహమ్మారి కోరల్లోనే ఉంది. వ్యాక్సిన్లపై ఉన్న మూఢనమ్మకాలు, హెల్త్ వర్కర్లపై దాడులు ఆ దేశాన్ని వెనక్కి నెడుతున్నాయి. జీఏవీఐ మద్దతు.. ఒక తాత్కాలిక ఊరట ప్రస్తుతం జీఏవీఐ సంస్థ అందిస్తున్న సాయం వల్ల పాకిస్తాన్ నెట్టుకొస్తోంది. కానీ 2030 నాటికి ఈ సపోర్ట్ నిలిచిపోనుంది. అప్పుడు మొత్తం భారాన్ని పాక్ ప్రభుత్వం స్వయంగా భరించాల్సి ఉంటుంది. 47 మిలియన్ల మంది పేదరికంలో ఉన్న దేశంలో ఖజానా ఖాళీగా ఉన్న స్థితిలో ఇంత భారీ మొత్తాన్ని కేటాయించడం అసాధ్యమనే చెప్పాలి. పాకిస్తాన్ హెల్త్ మినిస్టర్ ముస్తఫా కమల్ నిద్రలేని రాత్రులు గడపడానికి కారణం కేవలం వ్యాక్సిన్ల కొరత మాత్రమే కాదు.. ఆ దేశ పాలకుల ప్రాధాన్యతలు. ఆసిమ్ మునీర్ నేతృత్వంలోని మిలిటరీ వ్యవస్థ.. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఇప్పటికైనా భారత్ వ్యతిరేక రాజకీయాలను పక్కన పెట్టి ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించకపోతే... పాకిస్తాన్ భవిష్యత్తు అంధకారమవ్వడం ఖాయం. ఒక దేశపు ఆరోగ్య వ్యవస్థ కూలిపోతే అది ఆ దేశానికే కాదు, పొరుగు దేశాలకు.. ప్రపంచ ఆరోగ్య భద్రతకే ముప్పు.

# ఓటింగ్ కొరకు సర్వం సిద్ధం....

**నేడు అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీల ఎన్నికలు**

**పకడ్బందిగా ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు**

**అలియాబాద్ మున్సిపల్లో- 20, 454- ఓటర్లు**

**మూడుచింతలపల్లి మున్సిపల్లో -22, 831- ఓటర్లు**















శామీర్ పేట, ఫిబ్రవరి 10 ( గరుడ వార్త) : మున్సిపల్ ఎన్నికలకు సంబంధిత ఎన్నికల అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఓటర్ల తీర్పు కొరకు అభ్యర్థులు గుండె దడలతో ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి శామీర్ పేట మండలంలోని రెండు మున్సిపాలిటీలలో నిర్వహించే ఎన్నికలకు మంగళవారం అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఎన్నికల ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేసుకున్నారు. అలియాబాద్ మున్సి పాల్టీకి, మూడుచింతలపల్లి మున్సిపాల్టీకి ఎలక్షన్ కమీషన్ ఎన్నికలను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ఈ మున్సిపాల్టీల ఎన్నికలు సజావుగా జరిగేందుకై, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకై సంబంధిత ఎన్నికల అధికారులు, పోలీసులు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు.

**అలియాబాద్ మున్సిపల్లో 40 పోలింగ్ కేంద్రాలు.....**

కాగా అలియాబాద్ మున్సిపల్లో నిర్వహిస్తున్న 20 వార్డులకు గాను ఓటర్లు ఇబ్బందులు లేకుండా ఓట్లు వేసేందుకై సంబందిత ఎన్నికల అధికారులు 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల సందర్భంగా ఈ మున్సిపల్ ను 4 రూట్లుగా విభజించి 40 పోలింగ్ బ్యాలెట్ బాక్సులను, అదనంగా మరో 40 పోలింగ్ బాక్సులను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకై ప్రిసైడింగ్ ఆఫీసర్లు, సహాయ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఏపిఓలు, ఇతర సిబ్బంది కలిపి మొత్తం 200 మందిని వినియోగిస్తున్నట్లు జిల్లా ఎన్నికల సహాయ అధికారి, అలియాబాద్ మున్సిపల్ కమీషనర్ చంద్రశేఖర్ తెలిపారు.

అలియాబాద్ మున్సిపల్లోని 20 వార్డుల్లో పురష ఓటర్లు- 10,336, మహిళ ఓటర్లు- 10, 115, ఇతర ఓటర్లు- 3, మొత్తం 20, 454 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు చెప్పారు. కాగా అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల నుంచి, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం- 83 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మజీద్ పూర్ లోని శ్రీ టీ చైతన్య స్కూల్ ల్లో జిల్లా ఎన్నికల సహయ అధికారి చంద్రశేఖర్, ఎన్నికల ఇతర అధికారులు పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని, పోలింగ్ బ్యాలెట్ బాక్స్ లను పంపిణీ చేశారు. ఇక్కడి నుంచి ఏర్పాటు చేసిన బస్సుల్లో ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ బాక్స్ లను 200 మంది ఎన్నికల అధికారులు, సిబ్బంది తీసుకుని పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్ళారు. మున్సిపల్లో ఎన్నికలు ముగిసిన అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్స్ లను మజీద్ పూర్ లోని శ్రీ టీ చైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ కు తరలించేందుకై ఎన్నికల అధికారులు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు.

**మూడుచింతలపల్లి మున్సిపల్లో 48 పోలింగ్ కేంద్రాలు....**

కాగా మూడుచింతలపల్లి మున్సిపల్లో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకై 48 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల సహాయాధికారి, మున్సిపల్ కమీషనర్ పవన్ కుమార్ తెలిపారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో మున్సిపాలిటి ప్రాంతాన్ని 5 రూట్లుగా విభజించారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది కలసి 240 మందిని ఈ ఎన్నికల్లో వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఈ మున్సిపల్ ఎన్నికల్లో పురష ఓటర్లు- 11, 430, మహిళ ఓటర్లు- 11, 401, మె త్తం- 22, 831 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో 24 వార్డుల్లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన, స్వతంత్ర అభ్యర్థులు కలిపి 83 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని జగ్గంగూడలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాలలో జిల్లా ఎన్నికల అధికారులు పోలింగ్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని, పోలింగ్ బ్యాలెట్ బాక్స్ లను పంపిణీ చేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లను మైనార్టీ గుకుల పాఠశాల లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ



**శామీర్ పేట, ఫిబ్రవరి 10 (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళ వారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద శామీర్ పేట కు చెందిన దాసరి బాబు- ఎల్లుబాయి( మాజీ ఎంపీపీ) దంపతు లు, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. అలాగే శామీర్ పేట కు చెందిన కీ. శే బత్తిని ఈశ్వర్ గౌడ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, అలాగే డిజి వెంకటేష్ గౌడ్ వారి కుటుంబ సభ్యులు, బాబాగూడాకు చెందిన మస్కూరి కృష్ణ వారి కుటుంబ సభ్యులు అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.**



## పడకేసిన సుందరీకరణ.. రూ.కోటి చెరువుపాలు!

గోదావరిఖని : చెరువుల సుందరీకరణ పేరిట ప్రభుత్వం సుమారు తొమ్మిదేళ్ల కిందట రామగుండం నగరపాలక ప్రాంతంలో చేపట్టిన కార్యక్రమాన్ని నిధుల లేమితో నిలిపివేసింది. దీంతో అప్పటి వరకు వెచ్చించిన సుమారు రూ.కోటి నిధులు చెరువులో పోసినట్లయింది. వివిధ కారణాలతో అంచనాలను సుమారు సగం వరకు తగ్గించి మల్కాపూర్ చెరువును మినీ ట్యాంకుబండ్‌గా తీర్చిదిద్దే పనులకు శ్రీకారం చుట్టగా.. నిధులు సరిపోకపోవడంతో పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. అభివృద్ధి పనులు పూర్తికాకపోవడం, పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడంతో చెరువు శిఖం ఆక్రమణలకు గురవుతుండటంతో పాటు కట్ట పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మిషన్ కాకతీయ-2లో భాగంగా నగరంలోని మల్కాపూర్ చెరువును మినీ ట్యాంకుబండ్‌గా సుందరీకరించాలనే సంకల్పంతో రూ.1.97 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. వివిధ కారణాలతో కేవలం రూ.1.01 కోట్లు మాత్రమే కేటాయించి చెరువు అభివృద్ధి పనులకు 2017 ఫిబ్రవరి 4న శంకుస్థాపన చేశారు. నిధులు సుమారు సగానికి తగ్గించడంతో అభివృద్ధి పనులను అర్ధాంతరంగానే నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో అప్పటి వరకు చెరువు కట్ట అభివృద్ధి, బతుకమ్మఘాట్, మత్తడి పనులకు కేటాయించిన నిధులు వృథా అయ్యాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చెరువు మత్తడి నుంచి కట్ట మీదుగా శిఖం నుంచి తిరిగి మత్తడికి చేరుకునేలా వాకింగ్, సైక్లింగ్ ట్రాక్స్, గ్రిల్స్, రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం కట్టపైన మట్టిపోసి వదిలేశారు. శిఖంలో కనీసం మట్టి రోడ్డు సైతం వేయకపోవడంతో ఆక్రమణలకు గురవుతోందనే



ఆరోపణలున్నాయి. కట్టపైన విద్యుత్తు దీపాలు, ఓపెన్ జిమ్, బెంచీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. సప్తగిరి కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీ నుంచి చెరువు కట్ట వరకు అప్రోచ్ రోడ్డు నిర్మించాల్సి ఉంది.

చెరువు కట్టమీదుగా గోదావరిఖని ప్రశాంత్‌నగర్, సప్తగిరి కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు శ్రీనగర్ కాలనీ, మల్కాపూర్ వెళ్లేందుకు చాలా దగ్గరి దారి అయినప్పటికీ ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. రామగుండం నగరపాలక ప్రాంత సుందరీకరణతో పాటు సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ప్రభుత్వం మినీ ట్యాంకు బండ్ అభివృద్ధి పనులను పూర్తి చేసి నగర ప్రజలకు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## స్త్రీనిధి బకాయిలపై నజర్

పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకు, స్త్రీనిధి రుణాలు పంపిణీ చేస్తోంది. అంతవరకు బాగానే ఉన్నా తీసుకున్న రుణాల చెల్లింపునకు పలు సంఘాలు మొండికేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రుణ బకాయిల వసూళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. మొండికేసిన బకాయిదారులపై రెవెన్యూ రికవరీ చట్టం(ఆర్‌ఆర్) అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంఘాల్లోని మహిళల ఆస్తులు జప్తు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కొత్త చట్టంతో బకాయిలు వసూలయ్యే అవకాశం ఉంది.

**ఏటా రూ.70 కోట్ల రుణాలు**

ప్రైవేటు ఆగడాలను నుంచి రక్షించేందుకు స్త్రీనిధి రుణాలు మహిళలకు ఆర్థిక బాసటగా నిలుస్తున్నాయి. ఈ పథకంలో మహిళలకు అయిదు రకాల రుణాలు అందిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో మెప్మా, గ్రామీణంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏటా రూ.70 కోట్ల రుణాలు పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది మెప్మా ద్వారా రూ.18.43 కోట్లు లక్ష్యంగా ఉండగా ఇప్పటి వరకు రూ.18.48 కోట్లు పంపిణీ చేశారు. సెర్ప్ రూ.51.56 కోట్లకు రూ.44.08 కోట్లు పంపిణీ చేశారు. జిల్లాలో 10 వేల సంఘాల్లో లక్షకుపైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు

**రూ.8.89 కోట్లు..**

రుణాలు చెల్లించేందుకు విముఖత చూపడంతో మొండి బకాయిలు (నాన్ ఫర్ఫార్మెన్స్ అసెట్స్) సంఖ్య ఏటా పెరుగుతోంది. వీటిని రాబట్టేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. సంఘాల్లోని సభ్యులకు ముందుగా నోటీసులు జారీ చేస్తున్నారు. సెర్ప్ ఏపీఎంలు, డీపీఎంలు, స్త్రీనిధి సిబ్బంది గ్రామైఖ్య సంఘాల్లోని మహిళలకు రుణాల వసూళ్లపై అవగాహన కల్పిస్తున్నారు. రుణాలు చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేయనున్నామని వివరిస్తున్నారు. జిల్లాలో మెప్మాలో రూ.11.16 కోట్లకు రూ.10.45 కోట్లు, సెర్ప్ రూ.25.99 కోట్లకు రూ.18.06 కోట్ల వసూళ్లు అయ్యాయి. జిల్లావ్యాప్తంగా రూ.37.16 కోట్లకు రూ.28.51 కోట్లు వసూలుకాగా రూ.8.89 కోట్ల బకాయిలు ఉన్నాయి. **సద్వినియోగం చేసుకోవాలి**

స్త్రీనిధి రుణాల రికవరీ చట్టంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం. బకాయిలు చెల్లించేలా ప్రోత్సహిస్తున్నాం. వాయిదా పద్ధతిలో చెల్లిస్తే బకాయిలు తగ్గనున్నాయి. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

## స్కూల్ కాంప్లెక్స్‌లకు ఊతం

రాజపేట : స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు సంబంధించిన సమాచారంతో పాటు, రిపోర్టులు, కాంప్లెక్స్ సమావేశాలకు సంబంధించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపించాలంటే పాఠశాలల సముదాయ ప్రధానోపాధ్యాయులు ఇప్పటి వరకు ఇబ్బందులు పడేవారు. ప్రధానంగా ప్రైవేటు నెట్ సెంటర్ల చుట్టూ తిరిగి నివేదికలు, వేతన బిల్లులు చేయించాల్సి వచ్చేది. ఇక నుంచి ఆ ఇబ్బందులు తొలగనున్నాయి. తమ పాఠశాల నుంచే త్వరితగతిన నివేదికలు పంపించనున్నారు. ప్రభుత్వం సర్వశిక్షా అభియాన్ ద్వారా జిల్లాలోని ప్రతి స్కూల్ కాంప్లెక్స్‌కు ఒక కంప్యూటర్, ప్రింటర్ అందించింది. కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలకు సాంకేతికంగా వెసులుబాటు కలిగింది.

**తొలగనున్న ఇబ్బందులు..** కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు తరచూ తమ పరిధిలోని పాఠశాలలను పరిశీలించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల బోధన విధానం, పాఠ్యప్రణాళిక రాస్తున్నారా? బోధనోపకరణాలు వాడుతున్నారా? తదితర పలు అంశాలు పరిశీలిస్తారు. పాఠశాలల సముదాయ సమావేశ వివరాలతో పాటు వాటి నిర్వహణ, యూడైస్, లిప్, విద్యాసంబంధ కార్యకలాపాల నిర్వహణ పూర్తి వివరాల నివేదికను ఉన్నతాధికారులకు తరచూ పంపాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రతి స్కూల్ కాంప్లెక్స్‌కు ఒక కంప్యూటర్, ప్రింటర్ అందుబాటులోకి రావడంతో వారికి ఆ ఇబ్బంది తొలగనుందని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి.

ఉమ్మడి జిల్లా స్కూల్ కాంప్లెక్స్‌ల వివరాలు.. నల్గొండ : 100
సూర్యాపేట : 64 యాదాద్రి : 50

# క్లిక్ చేస్తే ఉచ్చులో చిక్కినట్టే

గంగాధర : గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన శ్రీవర్ధన్ రూ.47 వేలు, బూర్గుపల్లికి చెందిన మధు రూ.57 వేలు, సర్వారెడ్డిపల్లికి చెందిన కుమార్ రూ.46,540, మంగపేటకు చెందిన భవాని రూ.70 వేలు పోగొట్టుకోగా.. కోర్టు ఆర్డర్ ద్వారా బాధితులకు రికవరీ చేసే పనులను స్థానిక పోలీసులు పూర్తి చేశారు. త్వరలోనే వీరి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి.

అపరిచిత వెబ్‌సైట్లు, తెలియని వ్యక్తులు పంపే లింకుల నుంచి యాప్స్ డౌన్‌లోడ్ చేయొద్దు. కొన్నింటికి కెమెరా, గ్యాలరీ పర్మిషన్లు అవసరం ఉండదనే విషయాన్ని గమనించాలి.

ఇటీవల కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూర్గుపల్లి ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్ ఏపీకే ఫైల్ ఓపెన్ చేయడంతో ఆయన రెండు బ్యాంకు ఖాతాల్లోంచి సైబర్ నేరగాళ్లు రూ.13 లక్షలు కాజేశారు.

పెద్దపల్లి జిల్లా వ్యవసాయ శాఖలో ఇద్దరు అధికారుల చరవాణులను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి ఓ అధికారిణి భర్త బ్యాంకు ఖాతా నుంచి రూ.10 లక్షలు మాయం చేశారు.



**మూడు నెలల్లో రూ.23 కోట్లు**

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో గత మూడు నెలల్లోనే 485 కేసులు నమోదుకాగా రూ.23,69,50,800 నగదును బాధితులు పోగొట్టుకున్నారు. వీటిలో రూ.47,92,767 రికవరీకి పోలీసులు చర్యలు చేపట్టారు. బాధితులు రూ.లక్షల్లో కోల్పోతుండగా.. రూ.వేలల్లో కోల్పోయిన కేసుల్లోనే రికవరీ జరుగుతుంది. అది కూడా చాలా రోజులు పడుతుండటంతో బాధితులు ఆవేదన చెందుతున్నారు. అయితే రూ.లక్షల్లో మోసాలు జరిగిన సమయాల్లో ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు స్థానిక పోలీసులకు ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది.

**1930ని సంప్రదిస్తే..** బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు పోగొట్టుకున్నట్లు చరవాణికి సందేశం వస్తే వెంటనే మొదటి గంటనే గోల్డెన్ అవర్‌గా భావించి 1930 నంబర్‌ను సంప్రదించాలి. లేదా %cybercrime.gov.in% లో లాగిన్ అయి పూర్తి వివరాలతో ఫిర్యాదునమోదు చేయాలి. ఇలా చేయడంతో తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు స్పందించి కొన్ని సెకన్లలోనే ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు రిక్వెస్ట్ పెట్టి ఖాతాను ఫ్రీజ్ చేయిస్తారు. ఇందుకుగాను ప్రతి పోలీసు స్టేషన్‌లో సంబంధిత కానిస్టేబుల్ బాధితులతో మాట్లాడి రూ.25 వేల కంటే ఎక్కువగా కోల్పోతే కేసు నమోదు చేసి బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేసిన సొమ్మును ఇప్పిస్తారు.

# ఇచ్చుకో.. కట్టుకో.. ఇక కుదరదు

హైదరాబాద్: ఇల్లు నిర్మిస్తే.. ఆ దారి నిండా ఇటుక, ఇసుక, మట్టి వేయడం.. ఆ ప్రాంత అధికారికి అంతోఇంతో ఇచ్చేసి జబర్దస్తీ చేయడం.. కాలనీవాసులు గట్టిగా అడిగితే బెదిరించడం ఇక కుదరదు. ఏకంగా జీహెచ్‌ఎంసీ చట్ట సవరణకు ప్రతిపాదనలు చేసింది. రేపోమాపో ఆదేశాలు రానున్నాయి.

లక్ష్యం నగరంలో రహదారి కాలుష్యాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో రోడ్లపై ఇసుక, ఇటుకలు, మట్టి వంటి నిర్మాణ సామగ్రిని వేయడం, విక్రయించడంపై నిషేధం విధించేందుకు రంగం సిద్ధం చేసింది. భారీ జరిమానాలు విధించడం, ఉల్లంఘనులకు ఏడాది జైలుశిక్ష పడేట్టు జీహెచ్‌ఎంసీ చట్టంలో సవరణలు రాబోతున్నాయి.

**ప్రతిపాదనలు ఇలా..**

జీహెచ్‌ఎంసీ చట్టంలోని ఆర్టికల్ 112(2), (3,), (20), (25), ఆర్టికల్



115(39) ప్రకారం.. జులై 15, 2025న అప్పటి పురపాలకశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ, హైడ్రా కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు సమావేశమై.. చేర్పులు, మార్పులపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. రహదారులు, రద్దీ ప్రాంతాల్లో పాదచారులు, వాహనదారులు చెత్త పడేసేందుకు చిన్న డబ్బాలను ఏర్పాటు చేయడం, వ్యర్థాల నిల్వకు తాత్కాలిక ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను అందుబాటులోకి తేవడం, చెత్త నిర్వహణ కేంద్రాలను పెంచనున్నారు.

ఇసుక, ఇటుకలు, కంకర, మట్టి, ఇతర నిర్మాణ సామగ్రిని రహదారులు, కాలిబాటలపై అమ్మడాన్ని నిషేధిస్తున్నారు.

భవన నిర్మాణానికి సంబంధించిన వ్యర్థాలను అనధికారికంగా తరలించడం, ఇష్టానుసారం డంపింగ్ చేయడంపై నిషేధం ఉంటుంది. నిర్మాణ వ్యర్థాలను జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా తరలించే వాహనాలకు మొదటి తప్పుగా రూ.లక్ష జరిమానా. ఒక వేళ ఆ వ్యర్థాలను నాలాలు, చెరువులు, రోడ్లు, కాలిబాటలు, ప్రజలు తిరిగే చోట పడేస్తే.. రెట్టింపు జరిమానా విధిస్తారు.

రెండు, అంతకు మించి తప్పిదాలకు పాల్పడితే రూ.5లక్షల జరిమానా, ఏడాది వరకు జైలు శిక్ష ఉండేలా సవరణ చేస్తున్నారు.

జీహెచ్‌ఎంసీ వెలుపల కూడా వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకునే అధికారాన్ని కార్పొరేషన్‌కు కల్పిస్తారు. ఒకసారి ఉపయోగించి పడేసే ప్లాస్టిక్ వస్తువుల విక్రయం, వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ సెక్షన్ 487-ఏను జీహెచ్‌ఎంసీ చట్టంలో చేర్చనున్నారు.

# కొలువుల కోట.. నిర్లక్ష్యపు చీడ..!



ఖమ్మం: ఆధునిక ఆలయాలుగా పేరొందిన గ్రంథాలయాలకు నగరపాలిక/పురపాలికల్లో ఆదరణ కొరవడుతోంది. పుస్తక నిలయాల్లో మౌలిక వసతుల కల్పన, బిల్లుల చెల్లింపు, ఇతర ఖర్చుల నిమిత్తం నగరపాలిక/పురపాలికల నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థకు సెస్ రూపంలో పన్ను జమకాకపోవటంతో నిర్వహణ అంతంతమాత్రంగా ఉంటోంది. ఖమ్మం జిల్లాలో అదనపు కలెక్టర్ శ్రీజ ప్రత్యేక దృష్టి సారించటంతో సెస్ వసూళ్లలో ఇబ్బంది తలెత్తటం లేదు. భద్రాద్రి జిల్లాలో రూ.3కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. 2025-26లో రూ.1.50 కోట్ల సెస్‌కు కేవలం రూ.10 లక్షలు వచ్చాయంటే ఆర్థిక వనరుల లేమిని అర్థం చేసుకోవచ్చు. సత్తుపల్లిలో మూడేళ్ల క్రితం నిర్మించిన పుస్తక నిలయం మాత్రమే అధునాతనంగా ఉంది. కొత్తగా కొలువుదీరే పాలకవర్గాలు గ్రంథాలయాల ఆధునికీకరణ, వసతుల కల్పనపై దృష్టిసారించాలని పాఠకులు కోరుతున్నారు.

పాల్వంచలో రోజూ వచ్చే పాఠకులకు సరిపడా గ్రంథాలయ భవనం లేదు. కొన్నేళ్లుగా ఇరుకు గదులు కలిగిన పాత భవనమే పాఠకులకు దిక్కవుతోంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవటంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఐటీసీ సౌజన్యంతో నూతన భవనం నిర్మించినా గ్రంథాలయశాఖ స్వాధీనపరచుకోలేదు.

**తప్పని నిరీక్షణ**

ఏదులాపురం పురపాలిక పరిధిలో గ్రంథాలయం లేదు. ఖమ్మం గ్రామీణ మండలంలో నెలకొల్పాల్సిన పుస్తక భాండాగారాన్ని ఖమ్మం నగరంలో కొనసాగిస్తున్నారు. ఏదులాపురంలో కొత్తగా నిర్మించనున్న ప్రభుత్వ భవనాల సముదాయంలో లేదా తరుణీ హాట్ సముదాయంలోని భవనంలో గ్రంథాలయాన్ని ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ అంశాన్ని మంత్రి పొంగులేటి దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. అనువైన భవనాలను అధికారులు పరిశీలించారు.

**పట్టాలెక్కని ప్రతిపాదనలు**

వైరాలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన గ్రంథాలయ భవనం పాఠకులకు సరిపోవటం లేదు. ఇరుకు గదులతో ఇబ్బందులు పడుతున్నారు. రూ.కోటితో నూతన భవనం నిర్మించాలని కొన్నేళ్లుగా ప్రతిపాదిస్తున్నా మోక్షం కలగటం లేదు. అధునాతన గ్రంథాలయం నిర్మిస్తే పోటీపరీక్షలకు సన్నద్ధమై కొలువులు సాధిస్తామని నిరుద్యోగులు చెబుతున్నారు.

అశ్వారావుపేటలో దాత ఇచ్చిన భవనంలో గ్రంథాలయం కొనసాగుతోంది. స్థానిక వినతుల మేరకు డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుచేస్తామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. రూ.3లక్షల సెస్ పేరుకుపోయింది.

ఇల్లెందులో కొత్తగా నిర్మించిన భవనంలో ఇంటర్నెట్ సౌకర్యం ఉంది. సెస్ జమకాకపోవటంతో దినపత్రికలు, పుస్తకాల కొనుగోలుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**కొరవడిన పర్యవేక్షణ** కొత్తగూడెంలో ఏడాది క్రితం నూతన భవనంలోకి జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని మార్చారు. ఆవరణలో పచ్చదనం, చుట్టూ ప్రహరీ లేదు. రాత్రిపూట మందుబాబులు తిష్ఠవేస్తున్నారు. నీడనిచ్చే చెట్లు లేకపోవటం, షెడ్లు నిర్మించకపోవటంతో ఎండలోనే వాహనాలను నిలపాల్సి వస్తోంది. సెస్ జమకావటం లేదు. సిబ్బంది కొరత వేధిస్తోంది.

# ప్రణాళిక ఉంటేనే ప్రగతి!



ఖమ్మం: గృహాలు, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలకు భూమి వినియోగం, రహదారులు, మురుగుకాల్వలు, విద్యుత్తు, నీటివసతి, దాదాపు రాబోయే 20ఏళ్లలో జరగబోయే ప్రగతి, అప్పటి అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవటానికి పట్టణ స్థానిక సంస్థలకు బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) అవసరం. భవన నిర్మాణాలకు ఇదే ప్రామాణికం. పట్టణ సామాజిక, ఆర్థిక, అభివృద్ధికి మార్గదర్శకంగా పనిచేస్తుంది. అంతటి కీలకమైన బృహత్ ప్రణాళిక రూపకల్పన, అమలు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఆశించిన స్థాయిలో లేదు.

**కొత్తవాటిలో కానరాని చర్చలు**

ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం, కల్లూరు, భద్రాద్రి జిల్లాలోని అశ్వారావుపేట పురపాలికలు కొత్తగా ఏర్పడ్డాయి. కొత్తగూడెం, పాల్వంచ పురపాలికలతో పాటు మరికొన్ని గ్రామాలను కలిపి కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుచేశారు. వీటిలో ఇప్పటివరకు బృహత్ ప్రణాళికపై చర్చలే సాగలేదు. కొత్త పురపాలికల్లో గ్రామపంచాయతీ తరహా రహదారులు ఉన్నాయి. విలీన గ్రామాల్లో మురుగుకాల్వలే కానరావు. పంచాయతీ స్థాయి తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. ఈ పట్టణాలు విస్తరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయి.

**వైరా.. సుడా పరిధిలో..** వైరా పురపాలికకు బృహత్ ప్రణాళిక ఉంది. కానీ ఈ పట్టణం స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలోకి వస్తుంది. సుడా బృహత్ ప్రణాళికను అధికారులు తయారుచేసి ఆమోదం కోసం ప్రభుత్వానికి నివేదించారు. అనుమతి వచ్చాక దాని ఆధారంగా ప్రణాళికలు రూపొందించనున్నారు. మధిర పురపాలిక ఆవిర్భావం నుంచి ప్రణాళిక తయారీకి అడుగులు పడలేదు.

**అనుమతికి నిరీక్షణ**

సత్తుపల్లిలో 2023లో జరిగిన శాసనసభ ఎన్నికలకు ముందే బృహత్ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. మాస్టర్ ప్లాన్ గురించి ఇతర ప్రాంతాల్లో గొడవలు జరగటంతో పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. సత్తుపల్లిలో ఇప్పటికీ ఇరుకు రోడ్లు ఉన్నాయి. కొన్నిచోట్ల సీసీరోడ్లు, మురుగుకాల్వలు లేవు. రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులు మినహా అంతర్గత దారులన్నీ ఇరుకుగా మారాయి. త్వరగా బృహత్ ప్రణాళికకు అనుమతి ఇచ్చి దానికి అనుగుణంగా పట్టణం రూపురేఖలు మార్చాల్సిన అవసరముంది.

**1978 నాటి లెక్కలే..**

1978లో రూపొందించిన బృహత్ ప్రణాళికనే కొత్తగూడెం పురపాలికలో అనుసరించారు. కార్పొరేషన్‌గా మారిన తరువాత గతేడాది డ్రోన్ల ద్వారా ప్లాన్ రూపొందించేందుకు యత్నించారు. ప్రస్తుతం పట్టణీకరణకు అనుగుణంగా నగరం లేదు. కూలీలైన్, గణేశ్ టెంపుల్, తదితర ప్రాంతాల్లో అంతర్గత రహదారులు ఇరుకుగా ఉన్నాయి. ప్రస్తుత అవసరాల ప్రకారం కొత్తగూడెంలో 9.50 ఎంఎల్డీలకు 6.50, పాల్వంచలో 13 ఎంఎల్డీలకు 10 ఎంఎల్డీల తాగునీరే సరఫరా అవుతోంది. జిల్లాకేంద్రంగా మారాక నగరం విస్తరిస్తోంది. అధికారులు బృహత్ ప్రణాళిక రూపొందించి, జనాభాకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఇక 'ఆటం'కాలు ఉండవ్!

ఇల్లెందు : ఆట స్థలం లేని పాఠశాలలకు క్రీడా సామగ్రి కొనుగోలు కోసం పాఠశాల విద్య, సమగ్ర శిక్ష డైరెక్టర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలలు, టీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలతో పాటు కొత్తగా ప్రారంభించి.. క్రీడా స్థలం లేని పాఠశాలలను గుర్తించి సామగ్రి కొనుగోలు చేయాలని జిల్లా విద్యాశాఖకు సూచించింది. నిధులు ఆయా పాఠశాలల యాజమాన్య కమిటీ ఖాతాల్లో జమవుతాయని స్పష్టం చేసింది. మంజూరైన నిధులతో ప్రధానోపాధ్యాయులు మార్చి 31లోపు క్రీడా సామగ్రి కొనుగోలు చేయాలని డీఎంఓ నాగరాజశేఖర్ తెలిపారు.

ప్రాథమిక పాఠశాలలకు రూ.4వేలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.7వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.15వేల చొప్పున విడుదలయ్యాయి.

కొనుగోలు చేయాల్సిన క్రీడా సామగ్రి..

ప్రాథమిక పాఠశాలలకు..: క్యారమ్ బోర్డుతో కాయిన్స్, చెస్‌బోర్డుతో కాయిన్స్, స్కిప్పింగ్ రోప్స్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, కాక్స్, లూడో, స్నేక్స్ అండ్ లాడర్, హూప్స్ (పది), కోన్స్ (10), ప్లాస్టిక్



బాల్స్.

ప్రాథమికోన్నత బడులకు..: క్యారమ్ బోర్డు విత్ కాయిన్స్, చెస్‌బోర్డు విత్ కాయిన్స్, స్కిప్పింగ్ రోప్స్, టెన్నికాయిట్, ఉడెన్ డంబుల్స్, హూప్స్(10), లెజిమ్, షటిల్ బ్యాడ్మింటన్ రాకెట్స్ అండ్ కాక్స్, వాండ్స్, చిన్న క్రికెట్ బ్యాట్లు అండ్ బాల్స్, సాఫ్ట్ బాల్, కరాటే మ్యాట్స్, రెండు హాకీ స్టిక్స్. ఉన్నత పాఠశాలలకు..: హూప్స్, స్కిప్పింగ్ రోప్స్, షాట్‌పుట్, షటిల్ బ్యాడ్మింటన్ రాకెట్స్ అండ్ కాక్స్, టెన్నిస్ బాల్స్, త్రోబాల్స్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్, ఫుట్ పంప్, కోన్స్, చెస్ బోర్డు విత్ కాయిన్స్, 12 అంగుళాల స్టెప్ హార్డిల్, మార్కింగ్ కోన్, మల్టీ పర్పస్ మ్యాట్స్(కరాటే), ఉడెన్ డంబుల్స్, క్యారమ్ బోర్డు విత్ కాయిన్స్, లూడో, హాకీస్టిక్, యోగా మ్యాట్స్, బాస్కెట్‌బాల్ బోర్డు.

# బల్దియాల్లో డీజిల్ దొంగలు!

కరీంనగర్ : పుర, నగరపాలికల్లో వాహనాల వినియోగం పెరిగింది. పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ఇతరత్రా పనుల కోసం రూ.15 లక్షల నుంచి రూ.80 లక్షల విలువైన ఆధునిక యంత్రాలను కొనుగోలు చేశారు. వీటికి డీజిల్ వినియోగంపై నమోదులో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. కరీంనగర్, రామగుండం కార్పొరేషన్‌లలో ఏటా లక్షలాది రూపాయలను కేవలం ఇంధనం కోసమే వెచ్చిస్తున్నారు. రెండు వాహనాలు తిరిగిన చోట నాలుగైదు రాసి ప్రజాధనం కొల్లగొడుతున్నారు.

**జీపీఆర్ఎస్ లేక..**

పుర, నగరపాలికల్లో నడిచే ప్రతి వాహనానికి జీపీఆర్ఎస్‌ను ఏర్పాటు చేస్తే ఎక్కడికి వెళ్తుందనే సమాచారం ఇట్టే తెలుస్తుంది. దీంతోపాటు రోజులో ఎన్ని కిలోమీటర్లు నడిచిందో సమాచారం లభిస్తుంది. దీనివల్ల బిల్లుల చెల్లింపు విషయంలో ప్రామాణికత కనిపించేది. కానీ ఇలా ఏ ఒక్కచోట కూడా పారదర్శకమైన విధానాన్ని అవలంబించడం లేదు. మరోవైపు అధికారుల వాహనాలతోపాటు గతంలో ప్రజాప్రతినిధులుగా ఉన్న కౌన్సిలర్లు, కార్పొరేటర్లలో కొందరికి బల్దియా సొమ్ముతోనే డీజిల్ పోయించారనే విమర్శలున్నాయి. అసలే అరకొర నిధులతో అభివృద్ధి కుంటుపడుతున్న తరుణంలో ఇంధన సొమ్మునైనా పక్కాగా ఖర్చుచేస్తే



విలువైన ప్రజాధనం ఆదా కానుంది.

జమ్మికుంట పురపాలిక కార్యాలయంలో గత నెల 26న అనిశా అధికారులు విచారణ చేపట్టారు. చదును చేసే ట్రాక్టర్‌కు రోజుకు రూ.5 వేల డీజిల్ వినియోగించినట్లు రికార్డులో పేర్కొనడంతో అనుమానించారు. అప్పుడప్పుడు వినియోగించే ఆ ట్రాక్టర్‌కు ప్రతి రోజూ డీజిల్ ఖర్చులెందుకు రాశారని ప్రశ్నించగా సిబ్బంది నుంచి పొంతన లేని సమాధానమొచ్చింది. డీజిల్ వినియోగంలో అక్రమాలు గుర్తించినట్లు అనిశా అధికారులు ప్రకటించారు. దీంతో పాటు కార్యాలయ తనిఖీల్లో రూ.41 వేలు రసీదులకు అదనంగా ఉండటంతో వాటిని సీజ్ చేశారు.

గతంలో కరీంనగర్ కార్పొరేషన్‌లోనూ డీజిల్ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా నీటి ట్యాంకర్ల ట్రాక్టర్ల నుంచి డీజిల్‌ను సిబ్బంది బయటకు తీస్తున్న వీడియోలు బయటకొచ్చాయి. జనరేటర్లకు ఇంధనం వినియోగించకున్నా రోజూ పోస్తున్నట్లు లెక్కలు రాశారని కొందరు సామాజిక కార్యకర్తలు సహ చట్టం వివరాలతో బహిర్గతం చేశారు. విద్యుత్తు అంతరాయం లేకున్నా డీజిల్ కోసం రూ.15-20 వేలు వెచ్చించిన తీరు, అదనంగా లీటర్ల కొద్దీ ఇంధన దుర్వినియోగంపై విమర్శలొచ్చాయి.

రామగుండం కార్పొరేషన్‌లో ప్రతి నెలా పెట్రోల్, డీజిల్ ఖర్చులో రూ.6 లక్షల వరకు అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాల విషయంలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఇంధన లెక్కలు తీశారు. జగిత్యాల పురపాలికలో గతేడాది మార్చిలోనే రూ.16 లక్షలు నకిలీ బిల్లులు రికార్డుల్లో పొందుపర్చినట్లు విమర్శలొచ్చాయి. ఏటా రూ.అర కోటికి పైగా దుర్వినియోగమవుతుండటంపై ఫిర్యాదు రావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

# అదనపు లోడ్‌కు ఓసీ ఉండాల్సిందే

హైదరాబాద్: నగరంలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అనుమతులు.. అక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా ఇన్నాళ్లు అడ్డగోలుగా విద్యుత్తు కనెక్షన్లు జారీ చేశారు. నకిలీ ఓసీతో కొందరు గుత్తేదారులు, అధికారులు కలిసి చేసిన ఆరాచకం అంతా ఇంతా కాదు. ఈ అక్రమాలను అరికట్టేందుకు టీజీఎస్పీడీసీఎల్ కొన్నాళ్లుగా విద్యుత్తు కనెక్షన్ల జారీని కఠినతరం చేసింది. గతంలో ఇచ్చిన కనెక్షన్లపై ఫిర్యాదుల ఆధారంగా విచారణ, బాధ్యులైన సిబ్బంది, అధికారులకు మెమోలు జారీ చేస్తుండటంతో ఇప్పుడు నిబంధనల మేరకు ఉంటే కొత్త కనెక్షన్ అంటున్నారు. దీంతో గ్రేటర్‌లోని పది సర్కిళ్ల పరిధిలో సరైన పత్రాలు లేని దరఖాస్తులను డిస్కం పెండింగ్‌లో పెట్టింది. గడిచిన కొన్ని నెలల్లో వీటి సంఖ్య వేలకు చేరింది. అది కర్మన్‌ఘాట్‌లో పదేళ్ల క్రితం భవనం. ఆ రోజుల్లో అవసరాన్ని బట్టి పరిమిత లోడ్‌తో విద్యుత్తు కనెక్షన్లు తీసుకున్నారు. ఇటీవల వినియో గం పెరిగింది. ఇప్పుడు 160 కేవీఏ అదనపు లోడ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అదనపు లోడ్ అయినా సరే అక్యుపెన్సీ సర్టిఫికెట్ సమర్పించాల్సిందేనని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. ఓసీ సమర్పించకపోవడంతో నెలలుగా దరఖాస్తు పెండింగ్‌లోనే ఉంది.

**నోటరీలపై సందిగ్ధం..** నగరంలో చాలా వరకు నోటరీ పత్రాలను స్థలాలను కొనుగోలు చేసినవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వీరికి సైతం రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌తో పోలిస్తే స్వల్పంగా ఎక్కువ ఛార్జీలు వసూలు చేసి ఇది వరకు కనెక్షన్లు ఇచ్చేవారు. ఇప్పుడు వీటికి సైతం కనెక్షన్లు జారీ చేయడం లేదు. ఇవ్వాలని కొందరు అధికారులు, వద్దని మరికొందరు అంటున్నారు. సందిగ్ధం నెలకొంది. సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలో పదుల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని స్పష్టత కోసం కార్పొరేట్ కార్యాలయాన్ని సంప్రదిస్తున్నట్లు ఓ అధికారికు తెలిపారు. **జంట జలాశయ పరిధిలోనూ..** జంట జలాశయాలను పరిరక్షించేందుకు దశాబ్దాల క్రితం ప్రభుత్వం జీవో111 జారీచేసింది. వీటిపరిధిలో నిర్మాణాలకు స్థానిక సంస్థలు అనుమతులు ఇవ్వడం లేదు. అయినా పలు భవనాలు వెలిశాయి. ఇటీవల కట్టిన భవనాలకు విద్యుత్తు కనెక్షన్ కావాలని దరఖాస్తు చేసుకోగా.. నిబంధనల మేరకు అనుమతుల పత్రాలు, 10 మీటర్ల కంటే ఎత్తైన భవనాలైతే ఓసీ సమర్పిస్తేనే కనెక్షన్ అని అధికారులు పెండింగ్‌లో పెడుతున్నారు. నిబంధనలను కఠినంగా అమలు చేస్తుండటంతో శంషాబాద్, మొయినాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త కనెక్షన్లు జారీ నిల్చిపోయింది. **మరెలా?** విద్యుత్తు కనీస అవసరం కాబట్టి ఒక కనెక్షన్‌ను అది కూడా తాత్కాలిక కేటగిరి-8 కింద జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## శంకర్‌దాదా ఎంబీబీఎస్‌లకు ఇక కష్టమే

హైదరాబాద్: శంకర్‌దాదా ఎంబీబీఎస్‌ల ఆటలు కట్టించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిద్ధమైంది. నగరంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోంలలో పనిచేస్తున్న ప్రతి వైద్యుడు తప్పనిసరిగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్(టీఎంసీ)లో నమోదు చేయించుకోవాల్సిందేనని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. నగరవ్యాప్తంగా నకిలీ క్లినిక్‌లు, ఆసుపత్రుల దందా జోరుగా సాగుతోంది. అర్హత లేనప్పటికీ వైద్యులుగా చలామణి అవుతున్నారు. కొందరు ఎంబీబీఎస్ డిగ్రీతో పక్కన ఎండీ, ఇతర డిగ్రీలు పెట్టుకొని ప్రాక్టీసు చేస్తూ రోగులను తప్పు తోవ పట్టిస్తున్నారు.

మరికొందరు ఆసుపత్రుల్లో కొన్ని నెలలపాటు కాంపౌండర్లుగా పనిచేసిన అనుభవంతో ఏకంగా బస్తీల్లో క్లినిక్‌లు తెరుస్తున్నారు. ఎంబీబీఎస్, ఇతర నకిలీ డిగ్రీలతో బోర్డులు పెట్టి మరీ ప్రాక్టీసు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఇదో వ్యవస్థీకృత వ్యాపారంగా మారింది.



కొన్ని నెలలుగా టీఎంసీ ప్రతినిధుల తనిఖీల్లో ఇలాంటి నకిలీ క్లినిక్‌లు చాలా వరకు బయటపడ్డాయి. దాదాపు 300 మంది నకిలీ వైద్యులను గుర్తించి కేసులు కూడా నమోదు చేశారు. అయినా ఇంకా చాలా ప్రాంతాల్లో ఈ దందా నడుస్తోంది. అవసరం లేకున్నా యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్లు, ఇతర ఔషధాలను రోగులకు సిఫార్సు చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

**లోపాలుంటే సరిదిద్దుకోవాలి**

గ్రేటర్‌లో చిన్నాపెద్దవి కలిపి సుమారు 5 వేల ఆసుపత్రులు, క్లినిక్‌లున్నాయి. కొందరు మెడికల్ కౌన్సిల్ వద్ద నమోదు చేయించకుండానే సేవలందిస్తున్నట్లు, మరికొంతమంది వైద్యులు ఎంబీబీఎస్ మాత్రమే నమోదుచేసి పీజీ ఇతర అర్హతలను నమోదు చేయకుండానే విధులు నిర్వహిస్తున్నారని రంగారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు టీఎంసీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, అర్హత నమోదు పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకొని లోపాలుంటే సరిదిద్దుకోవాలని సూచించారు. అధికారుల తనిఖీల్లో దొరికితే చట్టపరంగా చర్యలు చేపడతామని ఆమె హెచ్చరించారు.

## ప్రయోగం.. ఆలోచనలకు రూపం

హుజూర్‌నగర్ : సృజనాత్మక ఆలోచనలకు శాస్త్రీయ రూపం కల్పించి వాటి ప్రయోగాత్మక నమూనాలు చేసి ఔరా అనిపించారు విద్యార్థులు. హుజూర్‌నగర్ విజయ విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో తమ నమూనాలను ప్రదర్శించారు. శాస్త్ర, సాంకేతికతతో అనేక సమస్యలకు పరిష్కారాలు చూపించిన తీరు సందర్శకులను ఆలోచింపజేసింది. ఇన్‌స్పైర్‌కు ఎంపికైన నమూనాలను తయారు చేసిన వారిని పలకరించగా వాటి ఉపయోగాలను వివరించారు.

**అప్రమత్తం చేసేలా..**

ప్రమాదాలను తగ్గించడానికి, ఆరోగ్య హెచ్చరికలతో కూడిన స్మార్ట్ స్టీరింగ్ ఇది. శరీర, మానసిక దృఢత్వాన్ని నిరంతరం పర్యవేక్షిస్తుంది. నిద్రమత్తు, ధూమపానం, మద్యపానం, వాహనం ముందు అడ్డంకులను స్మార్ట్ స్టీరింగ్ కనిపెడుతుంది. ఇందులోని మైక్రో కంట్రోలర్‌తో అనుసంధానమైన స్మార్ట్ సెన్సార్‌లతో ఇది పనిచేస్తుంది. వాహనం నడిపే సమయంలో అసాధారణ ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ముందుగానే హెచ్చరించి అప్రమత్తంగా వ్యహరించడానికి, ఇతర హెచ్చరికలను ఇది ముందే చెబుతుంది. దీని ద్వారా ప్రమాదాలను తగ్గించుకోవచ్చు.

కె.మహిధర్, సూర్యాపేట

**ఇంట్లో లేకున్నా మొక్కలకు నీరు..**

నీటిని పొదుపుగా వాడుతూ ఇళ్లలో మొక్కల పెంపకం, వ్యవసాయం ఎలా చేయాలో ఈ నమూనా తెలియజేస్తోంది. ఇందులో మొక్కకు నీరు ఎంత పెట్టాలనుకుంటున్నారో దానికి సెన్సార్ ఏర్పాటు చేసి మోటారు ఆన్ చేయాలి. మొక్కకు నీరు సరిపడా రాగానే ఆటోమేటిక్‌గా మోటారు ఆగిపోతుంది. పెరటి మొక్కలకు, పెద్ద తోటలకు దీన్ని ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల మనం ఇంట్లో లేని సమయంలోనూ నీరు పెట్టవచ్చు. నీటి పొదుపుతో పాటు విద్యుత్తు కూడా ఆదా అవుతుంది. ఎస్కే రషీద్, కోదాడ

**ట్రాఫిక్‌ను బట్టి కదిలే డివైడర్**

ట్రాఫిక్ ఇబ్బందులతో అతి తక్కువ దూరం కూడా గంటల తరబడి వెళ్లాల్సి వస్తుంది. అలాంటి సమయాలలో కదిలే డివైడర్లను ఏర్పాటు చేసుకోవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించి గమ్యాన్ని త్వరగా చేరుకోవచ్చు. కదిలే డివైడర్లు ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్ల సాయంతో రోడ్డు డివైడర్లకు అనుసంధానం చేసి ఎక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు ఉంటాయో అక్కడ డివైడర్లు అనుకూలంగా కదిలే అవకాశం ఉంటుంది. చాలా సందర్భాలలో ఒకవైపు భారీ ట్రాఫిక్ ఉంటుంది. మరో వైపు ఉండదు. అలాంటి సమయాలలో డివైడర్లను నియంత్రించడం ద్వారా ట్రాఫిక్ సమస్యను తగ్గించుకోవచ్చు.ఎస్కె సమీర, సూర్యాపేట

## కొత్త ప్లాట్‌ఫాంల నిర్మాణం.. విస్తరణ ప్రణాళిక

కాచిగూడ: నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్లలో ఒకటైన కాచిగూడ స్టేషన్ ఆధునికీకరణ, విస్తరణకు దక్షిణ మధ్య రైల్వే చర్యలు చేపట్టింది. స్థానికంగా కొత్త ప్లాట్‌ఫాంల నిర్మాణంపై రైల్వే హైదరాబాద్ డివిజన్ యంత్రాంగం దృష్టి సారించింది. ఇందుకు అవసరమైన స్థలాన్ని ఇవ్వాలంటూ సంబంధిత అధికారులు ఆర్టీసీకి ప్రతిపాదించారు. ఈ మేరకు ఆర్టీసీ ఉన్నతాధికారులతోనూ ప్రత్యేకంగా చర్చించారు. రైల్వేకు ఇచ్చే స్థలానికి ప్రత్యామ్నాయంగా మరోచోట ఇస్తామని కూడా ప్రతిపాదించారు. రోజురోజుకూ పెరుగుతున్న నగర జనాభా, రైళ్లకు అనుగుణంగా స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలు, స్టేబుల్, ఫిట్‌లైన్లు సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కాచిగూడ స్టేషన్ విస్తరణపై రైల్వే దృష్టి సారించింది.నిత్యం వేలల్లో ప్రయాణికులుఇక్కడి నుంచి ప్రతిరోజూ నగరంతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు లోకల్ ఎంఎంటీఎస్‌లతో పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. వాటిల్లో వేల మంది ప్రయాణిస్తూ తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకుంటున్నారు. వారి సంఖ్యకు అనుగుణంగా కాచిగూడ స్టేషన్‌లో సదుపాయాలు లేకపోవడం సమస్యగా మారింది.

పది ఎకరాల స్థలం..రైల్వే స్టేషన్‌ను ఆనుకొని ఆర్టీసీకి 10 ఎకరాల స్థలం ఉంది. ఈ స్థలాన్ని ఆర్టీసీ.. రైల్వేకు అప్పగిస్తే స్టేషన్‌ను విస్తరించి కొత్త ప్లాట్‌ఫాంలను నిర్మించడానికి వీలు కలుగుతుంది. తద్వారా కొన్ని దశాబ్దాల వరకు రైల్వేకు అవసరమైన భవిష్యత్తు అవసరాలు తీరుతాయి. అందుకు ప్రత్యామ్నాయంగా ఆర్టీసీకి అనువైన రైల్వే స్థలాన్ని అప్పగిస్తారు. ప్రతిపాదనలను సైతం పంపారు. కార్యరూపం దాల్చితే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి.

## బస్సు ఎక్కు.. బరువు తగ్గు!




హైదరాబాద్: వ్యక్తిగత వాహనాల వినియోగం పెరుగుతున్న కొద్దీ నగరంలో ట్రాఫిక్ జామ్‌లు, కాలుష్యంతో పాటు ఊబకాయం, మధుమేహంవంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బస్సు, మెట్రో వంటి ప్రజా రవాణాను వినియోగించడం ద్వారా బరువును తగ్గించుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని అంతర్జాతీయ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

జీవనశైలిలో మార్పుల వల్ల నగరంలో వెన్నునొప్పి, ఊబకాయం కేసులు దశాబ్ద కాలంలో 80శాతం పెరిగినట్టు వైద్యులు చెబుతున్నారు. బరువు తగ్గాలంటే ముఖ్యంగా ఆహారశైలిలో మార్పులు చేయడంతో పాటు నిరంతర వ్యాయామం అవసరమని, బస్సు ప్రయాణం అదనపు సహాయకారిగా ఉంటోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. బస్సు లేదా మెట్రో స్టాప్‌కి నడవడం, దిగాక గమ్యస్థానానికి చేరడం వల్ల రోజూ 1-2కిలోమీటర్ల నడక అదనంగా జోడించినట్టే. ఫలితంగా సుమారు 100నుంచి 300 క్యాలరీలు ఖర్చవుతాయి. బస్సులో నిలబడి ప్రయాణం చేయడం వల్ల కూడా 50 క్యాలరీల వరకు ఖర్చవుతాయి.

అధ్యయనాల ఫలితాలివి

భారత్‌లో చేసిన క్రాస్ సెక్షనల్ స్టడీ-2013 (పీఎల్‌వోఎస్ మెడిసిన్2013)'అసోసియేషన్ బిట్వీన్ యాక్టివ్ ట్రావెల్ టు వర్క్ అండ్ ఓవర్‌వెయిట్, డయాబెటిస్' అంశం పై చేసిన అధ్యయనంలోప్రైవేటు వాహనాలు వాడే వారిలో ఊబకాయం 50% ఉంటే ప్రజారవాణా ఉపయోగించే వారిలో 37.6 శాతమే అని స్పష్టం చేసింది. నడక, సైక్లింగ్, ప్రజారవాణా వినియోగంఊబకాయం, డయాబెటిక్ ప్రమాదాన్నిగణనీయంగా తగ్గిస్తుందని నిర్ధారించింది.

ప్రజా రవాణాతో మరిన్ని లాభాలు...

ట్రాఫిక్ తగ్గుతుంది.

వాయు నాణ్యత మెరుగుపడుతుంది.

ఆర్థిక భారం తగ్గుతుంది.

## మామూలు 'కథ కాదు భయ్యా'!



హైదరాబాద్: "శేరిలింగంపల్లి జోన్‌లో యాంటీ లార్వా ఆపరేషన్స్(ఏఎల్‌ఓ) కింద అదనంగా 30 మంది ఒప్పంద కార్మికులను నియమించేందుకు టెండర్లు పిలిచారు. పలువురు పోటీ పడ్డారు. సాంకేతిక అర్హత పేరుతో కొంతమంది గుత్తేదారులపై వేటు వేశారు. ఈ టెండర్ విలువ కేవలం రూ.22.87 లక్షలు మాత్రమే. అయినా కొత్తవారిని రానీయకుండా పాతవారికి కట్టబెట్టాలని ప్రయత్నాలు చేశారు. అందుకు భారీ పర్సంటేజీలేనని గుత్తేదారులే చెబుతున్నారు."

"కూకట్‌పల్లి జోన్ పరిధిలో చెరువులో గుర్రపు డెక్క తొలగించకుండానే బిల్లులు సమర్పించిన గుత్తేదారు వద్ద రూ.40 లక్షలకు బేరం కుదుర్చుకొని రూ.15 లక్షలు తీసుకుంటూ ఎస్ఈ చిన్నారెడ్డి అనిశాకు చిక్కిన విషయం సంచలనం సృష్టించింది."

జీహెచ్ఎంసీలో ఇంతకంటే పెద్ద తిమింగలాలే ఉన్నాయి. వారి ఆస్తులు చూస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. వారి జాబితా అనిశా చేతిలో ఉంది. కక్కుర్తి పడిన వారే అనిశా(అవినీతి నిరోధక శాఖ)కు పట్టుబడుతున్నారు.

ఓ పురపాలకసంఘం పరిధిలో ఇంటి నంబర్ల కేటాయింపులో ఓ అధికారి తన తెలివితేటలు ప్రదర్శించి విజిలెన్సు నిఘాలో దొరికారు. తర్వాత ఇటీవల బదిలీల్లో క్రమశిక్షణ చర్యకింద సస్పెండ్ అయ్యారు. ఓ అధికారి రూ.కోట్లు ఆస్తులు ఆర్జించారు. ఆయన వ్యవహారంపై అనిశాకు ఫిర్యాదులు అందినా.. దాడులకు మాత్రం పచ్చజెండా రాలేదు. ఆయన జీవనశైలి శ్రీమంతులనే తలపిస్తోంది.

ఇంజినీరింగు విభాగం అధికారులు పారిశుద్ధ్యం, ఎంటమాలజీ తదితర విభాగాల్లో ఆదాయం, కమీషన్‌లు ఎక్కువగా ఉన్నాయని తెలిసి.. టెండర్లు పిలిచేలా ఉత్తర్వులు దక్కించుకున్నారు.

ఇదీ పరిస్థితి

రాజేంద్రనగర్ పరిధిలో ఓ హోటల్ తనిఖీ పేరుతో డబ్బులు గుంజిన డిప్యూటీ కమిషనర్ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. చిన్న హోటళ్ల దగ్గర నుంచే మామూళ్లు వసూలు చేస్తున్న విషయం వెలుగు చూసింది. ఇంతకంటే ఎక్కువ మొత్తంలో తీసుకొని కేసులు లేకుండా చేసిన ఘటనలు కోకొల్లలు.కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు కమీషన్లు అందుతూనే ఉన్నాయి. ప్రతి పనికి కమీషన్ సాధారణమైంది.

ఇంజినీరింగ్ విభాగంలో ఉన్నత స్థాయి అధికారి ఒకరు పదోన్నతి లభించినా ఓ జోనల్‌కు ఇన్‌ఛార్జిగా నాలుగేళ్లకు పైగా కొనసాగారు. ఆయన కొంతమంది గుత్తేదారుల అక్రమాలకు అండగా నిలిచారు. ఇటీవల జీహెచ్ఎంసీలో అదనపు ఈఎండీ వ్యవహారంలో గోల్‌మాల్ జరిగింది. రూ.కోట్లలోనే డీడీలు మాయమయ్యాయి. దీనిపై గుత్తేదారులు ఫిర్యాదు చేస్తే.. ఓ ఉన్నతాధికారి రెండువర్గాలను కూర్చోబెట్టి పంచాయితీ నిర్వహించి ఒప్పందం కుదిర్చారు.

## మనస్పర్థలు వదిలి.. వందేళ్లు మజిలీ!



సిద్దిపేట : 'అడుగడుగున తొలి పలుకులు గుర్తుచేసుకో.. తడబడితే పొరబడితే తప్పు దిద్దుకో..' అంటూ ఓ సినీ కవి వివాహం గొప్పతనాన్ని వివరించారు. అగ్ని సాక్షిగా, మూడు ముళ్లు, ఏడడుగులతో కొత్త మజిలీ మొదలవుతుంది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో పలువురు దంపతులు భేషజాలకు పోకుండా ఆదర్శంగా నిలిచారు. నేడు వివాహ దినోత్సవం సందర్భంగా కథనం.

నాలుగు జిల్లాల్లో పలువురు దంపతుల మధ్య తలెత్తుతున్న గొడవలు.. అగాధంగా మారుతున్నాయి. పెళ్లయిన నెల మొదలు.. 20 ఏళ్లకూ దూరం అవుతున్నారు. ఎక్కువగా పెళ్లయిన మూడేళ్లకు గొడవలు తలెత్తుతున్నాయి. సయోధ్య లేమి, వ్యసనాలు, అనైతిక బంధాలు.. సంసారంలో చిచ్చుపెడుతున్నాయి.

చెరో సగంగా..

నాలుగు జిల్లాల్లో మారుతున్న జీవనశైలితో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆర్థిక సమస్యలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో బాధ్యతలను ఇద్దరూ సమంగా పంచుకోవాలి. ఇద్దరు కలిసి ప్రశాంతంగా మాట్లాడుకొని సమస్యలు పరిష్కరించుకోవాలి.

మార్పు తెచ్చేందుకు..

మహిళలు, దంపతులకు అండగా నాలుగు జిల్లాల్లో వివిధ కేంద్రాలు పని చేస్తున్నాయి. మహిళా పోలీసు ఠాణా, సఖి, స్నేహిత, ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రాల ద్వారా మార్పు తెస్తున్నారు. భర్త/భార్యను ప్రవర్తన మార్చుకోవాల్సిన ఆవశ్యకత వివరిస్తున్నారు.

కౌన్సెలింగ్‌లో ఏం చేస్తున్నారంటే..

దంపతుల వాదనను విని తప్పొప్పులు, భవిష్యత్తు పరిణామాలు చెబుతారు.

పట్టుదలతో కలిగే నష్టాలు.. ఓ మెట్టు దిగి అర్థం చేసుకోవడంతో కలిగే లాభాలు.

పొరపాట్లు సరిదిద్దుకోవడం, అవసరమైతే ఇరు కుటుంబాల పెద్దల సలహాలతో ఒక్కటి చేస్తున్నారు.

విలువలను గుర్తించాలి: అహంభావం వీడి అర్థం చేసుకోవడం ప్రధానం. గొడవ స్థాయి శ్రేయోభిలాషులు, పెద్దల వద్దకు తీసుకెళ్లాలి. అప్పటికీ తీరకుంటే కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఆశ్రయించాలి. సిద్దిపేటలోని స్నేహిత కేంద్రం ఎంతో మందికి బాసటగా నిలుస్తోంది.

వసంత, కౌన్సెలర్, సిద్దిపేట స్నేహిత కేంద్రం

భర్తకు అండగా..

గుమ్మడిదల మండలం అనంతారం గ్రామానికి చెందిన కొమ్ము కిష్టయ్య, యాదమ్మలకు వివాహమై 35 ఏళ్లు. రెండేళ్ల కిందట కిష్టయ్య పక్షవాతానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. అప్పటినుంచి యాదమ్మ అన్నీ తానై సపర్యలు చేస్తున్నారు. నిత్యం పొలం పనికి వెళ్లి, తిరిగొచ్చి భర్తకు సేవ చేస్తున్నారీ యాదమ్మ.

గుమ్మడిదల

దివ్యాంగుడని తెలిసినా..

పాపన్నపేట మండలం కుర్తివాడకు చెందిన ఈగ దేవయ్య వయసు 40 ఏళ్లు. నాలుగేళ్లున్నప్పుడు పోలియో సోకి కాళ్లు చచ్చుబడ్డాయి. అయినా పట్టుదలతో ఎంఎస్సీ (జువాలజీ), ఎంఏ తెలుగు, బీఈడీ పూర్తి చేశారు. విద్యాశాఖలో సీఆర్పీగా పని చేస్తున్నారు. 2015లో మెదక్‌వాసి భవానీ.. దివ్యాంగుడని తెలిసినా ఇష్టంతో పెళ్లిచేసుకున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దేవయ్య తల్లికి పక్షవాతం రాగా, ఇటు భర్తకు, అత్తకు సేవలు చేస్తున్నారు భవానీ.

మెదక్ టౌన్

గతేడాది కౌన్సెలింగ్ తీసుకున్న దంపతులు

సిద్దిపేట 1545

మెదక్ 452

సంగారెడ్డి 1920

వికారాబాద్ 1481

## ఆక్రమణలకు అడ్డుకట్ట!

ఆదిలాబాద్ :పట్టణానికి ఆనుకొని దాదాపు 114 ఎకరాల్లో విస్తరించిన ఖానాపూర్ చెరువుకు మూడువైపులా కట్ట నిర్మించి ఉండగా వెనుక వైపు లేదు. దీంతో కొన్నేళ్లుగా చెరువు స్థలం ఆక్రమణకు గురవుతూ వస్తోంది. భవిష్యత్తులో చెరువు ఆక్రమణకు గురికావొద్దంటే.. చుట్టూ కట్ట నిర్మించాలని నిర్ణయించారు. ఖానాపూర్ చెరువు పరిస్థితి అధ్వానంగా తయారైంది. పట్టణానికి ఆనుకుని 114 ఎకరాల్లో విస్తరించిన చెరువు.. పర్యాటకానికి అన్నివిధాలా అనుకూలించే పరిస్థితులు ఉన్నా సుందరీకరణకు నోచుకోవడం లేదు. చెరువు స్థలం ఆక్రమణకు గురై ఆహ్లాదాన్ని పంచకపోగా ఇటు మత్స్యకారుల ఉపాధికి తీరని నష్టం కలుగుతోంది. అమృత్ 2.0 పథకం కింద చెరువు పునరుద్ధరణకు రూ.3.14 కోట్లు మంజూరుకాగా, డీపీఆర్‌లో చెరువు చుట్టూ కట్ట నిర్మించాలని నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఎలా ముందుకెళ్తారో?**

చెరువు స్థలం ఆక్రమణకు గురికావడంతో గతేడాది సెప్టెంబరులో అధికారులు సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం, బఫర్‌జోన్‌లో ఎన్ని నివాసాలు ఉన్నాయో లెక్క తేల్చేందుకు బల్దియా, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. చెరువు వాస్తవ ఎఫ్‌టీఎల్ పరిధిలోని కొన్ని ఇళ్లకు మార్కింగ్ చేశారు. కొన్నేళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు అభ్యంతరం వ్యక్తం చేయడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. దీంతో రెండు రోజులకే సర్వే నిలిపివేశారు. ప్రస్తుతం అమృత్ 2.0 పథకం కింద చెరువుకు వలయాకార కట్ట నిర్మించాల్సి ఉంది. దీంతో అధికారులు కట్టను ఎలా నిర్మిస్తారు..? ఆక్రమణల విషయంలో ఎలా ముందుకెళ్తారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.



**చిగురించిన ఆశలు**

గతంలో ప్రభుత్వం మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామని 2017లో మిషన్ కాకతీయ పథకం కింద రూ.4.83 కోట్ల నిధులను వెచ్చించింది. అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు నాసిరకంగా జరిగాయి. చాలాచోట్ల చెరువు కట్ట కోతకు గురైంది. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినా వెలగడం లేదు. చెరువంతా గుర్రపు డెక్క వ్యాపించింది. గతంలో ఇదే చెరువు కింద ఏటా 100-150 టన్నుల చేపల దిగుబడి వచ్చేదని, వందలాది మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి లభించేదని మత్స్యకారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం చెరువు అభివృద్ధి చేయాలని తలపించడంతో అటు ఆహ్లాదంతో పాటు మత్స్యకారుల్లో ఆశలు చిగురించాయి.

**కలెక్టర్ ఆదేశం మేరకు**

అరుణ్, డీఈ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ

అమృత్ 2.0 పథకం కింద రూ.3.14 కోట్లు మంజూరయ్యాయి. ఖానాపూర్ చెరువు చుట్టూ కట్టను నిర్మించాల్సి ఉంది. గుత్తేదారుతో ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. ఆక్రమణల విషయంలో కలెక్టర్ ఆదేశానుసారం ముందుకెళ్తాం.

## ఆగదు కాలం.. ఆపకు పయనం

దండేపల్లి : ఓ అడుగు ముందుకు పడిందంటే.. దాన్ని వెనక్కి తీసుకోవచ్చు. సమయం అలా కాదు. గడిచిన కాలం వెనక్కి రాదు. వచ్చే రెండు నెలల్లో ఇంటర్ తర్వాత పది, డిగ్రీ తదితర పరీక్షలు జరగనున్నాయి. ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షలకు సైతం ప్రకటనలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో విలువైన సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే దానిపై 'న్యూస్‌టుడే' కథనం.

**డబ్బుకన్నా మిన్న** గడిచిన రోజు రద్దు చేసిన చెక్కు లాంటిది. చేతిలో ఉన్న డబ్బును ఎలా సద్వినియోగం చేస్తావో అలాగే సమయాన్ని వినియోగించుకోవాలి. ప్రధానంగా చదువు, నిద్రకు సమయాన్ని కేటాయించుకోవాలి. సమయానికి విలువ ఇవ్వాలి. అప్పుడే విజయతీ రాలకు చేరుస్తుంది.

**కబుర్లతో కాలక్షేపం..**కళాశాలకు వెళ్లే విద్యార్థులు పాఠ్యాంశాలంటే బోరు అంటూ తరగతి గదుల నుంచి బయటకు వచ్చేస్తున్నారు. బేకరీ, చరవాణులతో సమయం గడుపుతున్నారు. కబుర్లకు గుడ్‌బై చెబితేనే బంగారు జీవితం సొంతమవుతుంది.

**ఇవి పాటిస్తే ప్రయోజనం** 1.చరవాణి అవసరం మేరకే వాడండి. వినియోగానికి తగిన సమయం కేటాయించి పరిమిత సమయం వరకు వాడండి. 2.అదే పనిగా చాటింగ్ చేస్తే చదువుపై శ్రద్ధ తగ్గుతుందని గ్రహించండి. అంతర్జాలమంటే కేవలం వినోదం కోసం కాదు అమితమైన విజ్ఞానాన్ని కూడా పొందవచ్చని తెలుసుకోండి. ఏ రోజు పనులను అదే రోజు చేయండి. వాయిదా వేయొద్దు.

3.చదువుతో పాటు నిద్రకు తగిన సమయం కేటాయించండి. ఆరోగ్య



సూత్రాలు పాటించండి.

4.ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదవాలి. మేధస్సు పెంచుకోవడానికి ఎక్కువ సమయం కేటాయించాలే తప్ప సరదాలకు వృథా చేయకూడదు. మంచి మిత్రులతో స్నేహం చేస్తే విజ్ఞానం వస్తుంది.

ఉమ్మడి జిల్లాలో పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థుల వివరాలు

ఇంటర్ ప్రథమ సంవత్సరం 32,165

ద్వితీయ 29,870

పదో తరగతి 18,475

డిగ్రీ 48,895

లక్ష్యం తెలుసుకోవాలి ప్రతి విద్యార్థికి ఏదో ఒక లక్ష్యం తప్పనిసరి. లేదంటే జీవితం అంధకారమవుతుంది. చాలా మంది పది, ఇంటర్‌కు వచ్చే సరికి జీవిత లక్ష్యం ఏమిటి అని అడిగితే ఇంకా నిర్ణయించుకోలేదని చెబుతారు. మరికొందరు స్థాయికి మించి లక్ష్యం నిర్ణయించుకొని ఒత్తిడికి గురవుతుంటారు. అర్హత, ఆసక్తి అనుకూలత వంటి అంశాలను ఆధారంగా తీసుకొని లక్ష్యం ఏర్పరుచుకోవాలి. దీనిని సాధించాలంటే ప్రణాళిక అవసరం. అంటే కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

అస్మిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, దండేపల్లి

**ఎవరికైనా 24 గంటలే..** ఎవరికైనా రోజుకు ఇరవై నాలుగు గంటలు సమయమే ఉంటుంది. సమయానికి పేద, ధనిక లాంటివి ఉండదు. తరగతి గదుల్లో కొందరు విజేతలుగా ఉంటే మరికొందరు పరాజితులవుతున్నారు. చదువుపై దృష్టి పెట్టడం, ప్రణాళికాబద్ధంగా చదువుకోవటంలో ఉన్న వ్యత్యాసమే దానికి కారణం. బలిజపెల్లి కిషన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

# కూలీలు కావలెను!

నల్గొండ: యాసంగి సాగు జోరందుకున్న వేళ.. రైతులకు నాట్లు వేసేందుకు కూలీల కొరత ఏర్పడింది. డిసెంబరు రెండోవారం నుంచి నారుమళ్లు చల్లుకున్న వారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ఒక్కరోజు ఒక్కో కూలీకి గరిష్ఠంగా రూ.800 వరకు చెల్లిస్తామని చెబుతున్నా.. దొరకని పరిస్థితి. ఒకవైపు నాగార్జునసాగర్, మూసీ, డిండి, ఎస్సారెస్పీ, ఇతరత్రా ప్రధాన జలాశయాలు, చెరువుల్లో సమృద్ధిగా నీటి వనరులున్నాయి. బోర్ల నిండా నీటి లభ్యత ఉంది. ఎటొచ్చి కూలీల కొరతే వేధిస్తుండటంతో రైతులు నాట్లు వేసే ప్రక్రియను వాయిదా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3.15 లక్షల మంది రైతులు 12 లక్షల ఎకరాల్లో వరి, 2 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేశారు. యాసంగిలో గరిష్ఠంగా 2.5 లక్షల మంది రైతులు 11 లక్షల వరకు వరి సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

నల్గొండ, వేములపల్లి, నేరేడుచర్ల, కనగల్, హాలియా, రాజపేట, ఆలేరు, గరిడేపల్లి, తుంగతుర్తి ప్రాంతాల్లో ఎకరానికి గరిష్ఠంగా రూ.6వేల వరకు చెల్లిస్తామని, నాట్లు వేయమని పిలిచినా కూలీలు దొరకడం



లేదు. ఉత్తరప్రదేశ్, బిహార్‌తో పాటు ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు వచ్చే ఒడిశా, రాజస్థాన్ కూలీలతో నాట్లు వేయించాల్సిన పరిస్థితులున్నాయి. వారూ రానుపోనూ ప్రయాణ ఖర్చులు కూడా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్రాక్టర్‌తో దుక్కి దున్నేందుకు గంటకు రూ.1,800 వరకు వసూలు చేస్తున్నారు. ఎరువుల బస్తా రూ.1,450లకు, డీఏపీ, ఇతరత్రా కలుపు మందులు కలిపి మొత్తం రూ.1,900 వరకు ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

**సాగు ఖర్చుల భయంతో ప్రకృతి వ్యవసాయం**

రాంరెడ్డి, రైతు, చందనపల్లి

పెరిగిన సాగు పెట్టుబడి వ్యయంతో సేద్యం చేయడం ఇబ్బందికరంగా ఉంది. ఇతర రాష్ట్రాల కూలీలు కూడా సకాలంలో దొరకడం లేదు. సీజన్‌లో ఒక్కో కూలీకి రూ.800 వరకు ఇస్తామని చెప్పినా రావడం లేదు. ఎకరానికి రూ.6వేలు వరకు ఖర్చవుతున్నాయి. యూరియా, పురుగు మందుల ఖర్చు భయంతో నాకున్న ఐదెకరాల పొలంలో కేవలం గోఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని కుటుంబంతోనే నాట్లు వేసుకుని సాగు చేసుకుంటున్నాం.

# అతివకు భరోసా

రాజపేట : అతివల భద్రతకు ప్రభుత్వం భరోసా కేంద్రాలు నిర్వహించనుంది. గ్రామీణ ప్రాంతాలకు సైతం ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. వేధింపులకు గురవుతున్న మహిళలు, బాలికల భద్రతకు జెండర్ రిసోర్స్ సెంటర్లు (జీఆర్సీ) ఏర్పాటు చేయనున్నట్లుగా అధికార వర్గాలు వెల్లడించాయి. తొలుత జిల్లాలో ప్రయోగాత్మకంగా నాలుగు మండలాలను ఎంపిక చేసి కార్యాచరణకు పూనుకుంది. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో పోలీస్, మహిళా, శిశు సంక్షేమ, ఇతర శాఖలు జెండర్ రిసోర్స్ కేంద్రాల నిర్వహణలో భాగస్వామ్యం కానున్నాయి.

**కార్యక్రమాలు ఇలా..** గ్రామస్థాయిలో ముగ్గురు, మండల స్థాయిలో ఐదుగురు సామాజిక కార్యాచరణ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ప్రతి గురువారం జీఆర్సీ కేంద్రాల్లో కమిటీ సభ్యులు గృహహింస, లైంగిక వేధింపులు, మానసిక ఒత్తిడి, వరకట్న వేధింపులపై ఫిర్యాదులు స్వీకరిస్తారు. గ్రామస్థాయిలో సామాజిక ఆర్థిక సమస్యల పరిష్కారం, చట్టాలపై అవగాహన కల్పిస్తారు. షీ టీం, సఖి, బాలిక సాధికారత



కేంద్రాల సేవలు వివరిస్తారు. ఆడపిల్లలకు 21 ఏళ్లు నిండాకే వివాహం, బాలికలందరినీ చదివించడం, అంటరానితనం నిర్మూలించడం అనే అంశాలపై సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తారు.

బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు అరికట్టడం, తక్షణ పోలీస్ సహాయం, లైంగిక దాడి బాధితులకు వైద్యం, న్యాయం, పోలీసు సేవలను ఒకే చోట అందించనున్నారు.

బాధితులకు తక్షణ సాయం అందుతుంది

నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ

మహిళల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. జెండర్ రిసోర్స్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ జరుగుతుంది. ముఖ్యంగా గృహహింస, లింగ వివక్ష, వేధింపులు, సామాజిక, ఆర్థిక సమస్యలకు సంబంధించి తక్షణ సాయం అందనుంది.

# కార్పొరేషన్‌లో ఖరారు!

నల్గొండ : నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పుర నుంచి మహానగరపాలక సంస్థగా ఆవిర్భవించిన తర్వాత మొదటిసారి ఎన్నికలు జరగనున్నాయి. డివిజన్ల రిజర్వేషన్లను ఎస్టీ, ఎస్సీలకు జనాభా సంఖ్య, బీసీలకు కుల గణనను పరిగణనలోకి తీసుకొని రిజర్వేషన్లు నిర్ణయించినట్లు సమాచారం. ప్రభుత్వం నిర్దేశించిన రిజర్వేషన్లను కలెక్టర్ ఆధ్వర్యంలో డివిజన్ల వారీగా రిజర్వేషన్లు నిర్ణయించినట్లు తెలిసింది. రాజకీయనాయకుల మధ్య మహిళలకు దక్కాల్సిన డివిజన్లకు శనివారం డ్రా పద్ధతిలో కేటాయించి అధికారికంగా విడుదల చేసే అవకాశముంది. తెలిసిన రిజర్వేషన్లు ఖరారు కానుండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

# అక్రమాలు నిజమే.. కాదంటే గ్యాసే



మూసాపేట : చమురు సంస్థలు సరఫరా చేసే గ్యాస్ రెండు రకాలు. ఒకటి గృహ అవసరాలకు.. మరొకటి వాణిజ్య అవసరాలకు. దీన్ని ఎవరు అతిక్రమించినా చట్టరీత్యా బాధ్యులవుతారు. అయినా పలు గ్యాస్ సంస్థలకు చెందిన సిబ్బంది వ్యాపారులతో కుమ్మక్కై వంటగ్యాస్ సిలిండర్లను బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా సాగుతున్న ఈ వ్యవహారంలో తరచూ దుర్ఘటనలు జరుగుతున్నాయి. ఆయా సందర్భాల్లో విలువైన ఆస్తినష్టంతో పాటు కొన్నిసార్లు ప్రాణాలు సైతం గాల్లో కలుస్తున్నాయి. ఈ నెల 13న కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్, కేపీహెచ్‌బీకాలనీ మూడో ఫేజ్‌లో వేర్వేరుగా జరిగిన ఘటనల్లో భారీగా ఆస్తినష్టం సంభవించింది. ఈ రెండు చోట్లా గ్యాస్ రీఫిల్లింగ్ చేసే క్రమంలో జరగడం గమనార్హం.

**డెలివరీ బాయ్స్ దందాతో.**

చమురు సంస్థలకు సంబంధించిన గ్యాస్ ఏజెన్సీల నుంచి గృహ అవసరాలు, వాణిజ్య విభాగం సిలిండర్లు బయటకు రావాలంటే డెలివరీ బాయ్స్ (సరఫరా సిబ్బంది)ది కీలకపాత్ర. తమ వద్దకు వచ్చే సిలిండర్లను వినియోగదారులకు అందించకుండా అక్రమదందాకు తెరలేపుతున్నారు. సాధారణంగా గ్యాస్ ఏజెన్సీల్లో 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండరుకు రూ.905లు తీసుకుంటారు. ఇందులోంచే డెలివరీ బాయ్స్‌కు రూ.18లు చెల్లిస్తారు. ఇది చాలదన్నట్లు వినియోగదారుల వద్దా వారు అదనంగా డబ్బులు తీసుకుంటుంటారు. ఇంకా ఒక్కో సిలిండరును రూ.1,500 నుంచి రూ.2 వేల దాకా హోటళ్లు, ఇతర వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి వాణిజ్య అవసరాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా కమర్షియల్ సిలిండర్లను అందజేస్తోంది. 19 కిలోల సిలిండర్‌కు రూ.1,920లుగా నిర్ణయించారు. తక్కువధరకు వస్తున్నాయనే కారణంతో డెలివరీ బాయ్స్‌తో కుమ్మక్కవుతున్న కొందరు వ్యాపారులు గృహ అవసరాలకు వినియోగిస్తున్న సిలిండర్లను వాడుతున్నారు.

**కొంప ముంచుతున్న రీ ఫిల్లింగ్**

కొందరు దుకాణదారులు అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్‌కు పాల్పడుతున్నారు. డెలివరీ బాయ్స్ నుంచి కొనుగోలు సిలిండర్లలో ఒక్కో దాని నుంచి మూడు, నాలుగు చిన్న సిలిండర్లలోకి నింపి మార్కెట్‌లో రూ.500-రూ.750ల దాకా విక్రయిస్తున్నారు. తద్వారా వారికి రెండుమూడురెట్లకు పైగా ఆదాయం వస్తుంది. గ్యాస్ కనెక్షన్లు లేని నివాసితులు, పేదలు ఈ తరహా సిలిండర్లను నింపుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు రీఫిల్లింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రశాంత్‌నగర్ ఘటనలో దుకాణంలో నిల్వ ఉంచిన 12 సిలిండర్లు బాంబుల తరహాలో వరుసగా పేలడం గమనార్హం.

# అనుమతుల్లో వేగం.. అభివృద్ధికి పునరుజ్జీవం



హైదరాబాద్: నగరంలో అభివృద్ధి పనులు పట్టాలెక్కే సమయం వచ్చింది. ఏళ్ల తరబడి భూసేకరణ వద్ద నిలిచిపోయిన రోడ్డు విస్తరణ, పైవంతెనల నిర్మాణ పనులు త్వరలో వేగం పుంజుకోనున్నాయి. మూసీ పునరుజ్జీవ పనులకూ మార్గం సుగమమైంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణ అనుమతుల నిబంధనలను సవరిస్తూ.. టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్)కు డిమాండ్ పెంచుతూ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుతో.. ఆయా ప్రయోజనాలు కలగనున్నట్లు అధికార యంత్రాంగం ధీమా వ్యక్తం చేస్తోంది.

**నిధుల సమస్య నుంచి ఉపశమనం..** హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టదలచిన రోడ్డు విస్తరణ, పైవంతెనల నిర్మాణం కోసం, వ్యూహాత్మక నాలాల అభివృద్ధి (ఎస్ఎన్‌డీపీ) కింద వరద నాలాల విస్తరణ పనుల కోసం భూసేకరణ ప్రతిపాదనలూ సర్కారు వద్ద ఉన్నాయి. వాటన్నింటికీ కలిపి రూ.1000 కోట్ల నిధులు అవసరం. భూసేకరణకు నగదు రూపంలో కాకుండా, అభివృద్ధి బదలాయింపు హక్కు (టీడీఆర్) ద్వారా పరిహారం చెల్లించే విధానం గ్రేటర్‌లో అమలవుతోంది. ఉదాహరణకు కేబీఆర్ పార్కు చుట్టూ స్టీల్ బ్రిడ్జీల నిర్మాణం, ఉప్పల్ కూడలిలో పైవంతెనల నిర్మాణం, తదితర ప్రాజెక్టులు భూసేకరణ సమస్య వల్ల ముందుకు సాగట్లేదు. ప్రభుత్వం టీడీఆర్‌కు డిమాండ్ పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో.. భూ యజమానులు టీడీఆర్ సర్టిఫికెట్ల ద్వారా పరిహారం తీసుకునేందుకు ముందుకొస్తారని, తద్వారా పనులు ముందుకుసాగుతాయని జీహెచ్‌ఎంసీ అంచనా వేస్తోంది.

**మూసీ నదికి అస్త్రం..** మూసీ నదిని అభివృద్ధి చేయాలంటే దాదాపు 3వేల ఆస్తులను సేకరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే.. నగరంలో టీడీఆర్ వినియోగానికి డిమాండ్ పెంచుతున్నామని, మూసీకి అవసరమైన భూసేకరణకు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాని ఈ నెల 14న జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, హైడ్రా, ఇతర శాఖల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు.

**ప్రస్తుతం 300 ఎకరాలకుపైగా..** 300ఎకరాలకుపైగా విస్తీర్ణమున్న టీడీఆర్ సర్టిఫికెట్లు మార్కెట్లో ఉన్నాయి. ఐదేళ్ల కిందట టీడీఆర్ ధర కనిష్ఠంగా 18శాతానికి పడిపోయింది. ప్రస్తుతం 50శాతానికి పెరిగింది. సర్కారు తీసుకొచ్చిన కొత్త నిబంధనతో.. టీడీఆర్ ధర, వినియోగం పెరుగుతుందని నగర ప్రణాళిక విభాగం పేర్కొంటుంది.

# రోడ్డు వేస్తాం.. తవ్వేస్తాం



హైదరాబాద్: ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఉప్పల్‌లోని సూర్యనగర్ కాలనీ. సరిగ్గా ఏడు నెలల కిందట కాలనీలో సీసీ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు అదే రోడ్డును తవ్వుతున్నారు. ఇదేంటని అడిగితే.. పాత డ్రైనేజీ పైపులను తొలగించి.. కొత్తవి ఏర్పాటు చేస్తామని గుత్తేదారులు సమాధానమిస్తున్నారు. మురుగునీటి పైపులైను వేసి.. మొక్కుబడిగా సీసీ రోడ్డు వేస్తారు. రెండు నెలల్లో ఆ ప్రాంతం గుంతలుగామారుతుంది. మరో ఆర్నెల్లకు జీహెచ్‌ఎంసీ మళ్లీ రోడ్డు నిర్మిస్తుంది. ఇలా ప్రజా ధనాన్ని దోచేందుకు పలువురు ఇంజినీర్లు, గుత్తేదారులు కలిసి చేస్తోన్న దందా ఇది. ఒకే మ్యాన్‌హోల్, ఒకే రోడ్డుకు.. ఏడాది పొడవునా మరమ్మతులు చేస్తూ.. ఏటా రూ.200కోట్లకు పైగా నిధులను అవినీతి అధికారులు దారి మళ్లిస్తున్నారనే విమర్శలున్నాయి.

ముందస్తు వ్యూహమేనా? మేము రోడ్లు వేస్తుంటే జలమండలి అధికారులు తవ్వేస్తున్నారని జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు.. వాళ్లు సమాచారం ఇవ్వకుండా రోడ్లు వేస్తారని జలమండలి ఇంజినీర్లు పరస్పరం విమర్శలు చేసుకుంటుంటారు. కానీ.. సదరు అధికారులు ముందస్తు వ్యూహంలో భాగంగానే విమర్శలు చేసుకుంటారని.. జలమండలి ఆఫీసు సమీపంలోని రోడ్ల దుస్థితే అందుకు నిదర్శనమని క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

ఇవిగో ఉదాహరణలు..బంజారాహిల్స్ రోడ్డు నం.7లో గతేడాది మేలో జీహెచ్‌ఎంసీ రోడ్డును తవ్వింది. భూగర్భ నాలా పొడవునా సీసీ రోడ్డు నిర్మించింది. ఆ రోడ్డును జలమండలి అధికారులు ఇప్పుడు తవ్వుతున్నారు. అమీర్‌పేట్ ప్రధాన రహదారి నుంచి ఎల్లారెడ్డి గూడకు ఆర్నెల్ల కిందట సీసీ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు.. ఆ రోడ్డులోని వరద నీటి మ్యాన్‌హోళ్ల మరమ్మతులకు రోడ్డును ఇష్టానుసారం తవ్వుతున్నారు.

అమీర్‌పేట్ ఎంసీహెచ్ మార్కెట్ రోడ్డును.. సగటున ఆర్నెల్లకోసారి నిర్మిస్తుంటారు. ఇప్పుడు నెల కిందట నిర్మించిన సీసీని కూడా తవ్వుతున్నారు. ఇలాంటివి నగరంలో అడుగడుగునా కనిపిస్తున్నాయి.

# రోగులు రెట్టింపు.. లేని పట్టింపు!

దేవరకొండ : దేవరకొండ డివిజన్‌లో స్థానికంగా ఉన్న ఏరియా ఆసుపత్రి అతిపెద్దది కావడంతో రోగుల సంఖ్య పెరుగుతూ వస్తుంది. సాధారణంగా ఓపీ 500 నుంచి 600 ఉండగా.. కొన్ని రోజుల్లో 800 నుంచి 1000 వరకు ఉంటుంది. దవాఖానాలో వైద్యులు రోగులకు రక్త, మూత్ర పరీక్షలు, ఎక్స్‌రే, స్కానింగ్ వంటివి రాసి పంపుతారు. పరీక్షలు చేయించుకొని ఫలితాలు తీసుకొచ్చిన రోగి వైద్యుల కోసం వెతకాల్సిన వస్తోంది. రక్త పరీక్షల ఫలితాలు వచ్చే



సరికి మధ్యాహ్నం 12 గంటలు దాటుతుంది. అప్పటికే వైద్యులు సమయం ముగిసిందని వెళ్లిపోవడంతో రోగుల పరిస్థితి దయనీయంగా మారింది. గ్రామాలకు వెళ్లి తిరిగి మరుసటి రోజు పరీక్ష ఫలితాలను తీసుకొని సంబంధిత వైద్యున్ని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కొందరు రోగులు ఆ పరీక్ష ఫలితాలను తీసుకొని ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి, జేబులు ఖాళీ చేసుకునే దుస్థితి నెలకొంది. పీహెచ్‌సీల్లో సరైన పరికరాలు, నిపుణులు అందుబాటులో లేకపోవడంతో డివిజన్ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలు అగ్ని పరీక్షగా మారాయి. అధికారుల తీరు మారాలని రోగులు వాపోతున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రకాష్‌ను వివరణ కోరగా.. రక్త పరీక్షలు ముగించుకొని రిపోర్టును తీసుకొచ్చిన రోగి అత్యవసర వార్డులో ఉన్న వైద్యున్ని సంప్రదించి, మందులను తీసుకోవాలని, అత్యవసర విభాగంలో వైద్యుడు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.

# చివరి దశకు పత్తి కొనుగోళ్లు

జమ్మికుంట : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పత్తి విక్రయాలు చివరి దశకు చేరుకున్నాయి. రోజు వారీ ధరల వ్యత్యాసాలతో రైతులు పత్తిని విక్రయించేందుకు సీజన్ మొదటి నుంచి చివరి దాకా నిరీక్షించారు. ఉమ్మడి జిల్లాలో 23 జిన్నింగ్ మిల్లులను సీసీఐ నోటిఫై చేసుకొని పత్తిని మద్దతు ధరకు ఖరీదు చేసింది. నిబంధనలు, కపాస్ కిసాన్‌యాప్ ద్వారా స్లాట్ బుకింగ్‌లో మొదట్లో రైతులు కొంత ఇబ్బందులు పడ్డారు. అవసరమైన పత్రాలు, నిబంధనలు పాటిస్తూ అధిక శాతం రైతులు సీసీఐకే పత్తిని విక్రయించారు.

**సిరిసిల్లలోనే అధికం**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1,63,030 ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. 19,56,360 క్వింటాళ్ల దిగుబడి అంచనా వేశారు. కరీంనగర్ జిల్లాలో 44,875 ఎకరాల్లో పత్తి సాగు కాగా.. 5.38 లక్షల క్వింటాళ్లు దిగుబడి



అంచనా వేశారు. 14,958.51 మెట్రిక్ టన్నులు సీసీఐ కొనుగోలు చేసింది. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్‌లోనే సీసీఐ రూ.118.87 కోట్ల విలువ చేసే అత్యధిక పత్తిని కొనుగోలు చేసింది.

**తగ్గిన పత్తి విక్రయాలు**

గత ఏడాది అక్టోబరు నుంచే పత్తిని రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. జమ్మికుంట మార్కెట్‌కి 15 రోజులుగా 20 ట్రాలీల పత్తి కూడా రావటం లేదు. క్రమేణా విక్రయాలు పడిపోయాయి. మరో నెల రోజులు వ్యాపారం సాగవచ్చని వ్యాపారులు అంటున్నారు. జిన్నింగ్ చేసిన దూది బేళ్లను తమిళనాడుకు వ్యాపారులు తరలిస్తున్నారు. సీసీఐ నోటిఫై చేసుకున్న మిల్లుల నుంచి బేళ్లను సంబంధిత గిడ్డంగులున్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో కేవలం 450 బేళ్లను విక్రయానికి తరలించినట్లు ఓ జిన్నింగ్ వ్యాపారి తెలిపారు.

# ఖజానాకు కన్నం.. విచారణ వేగవంతం

సంగారెడ్డి: వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ సొమ్మును దారి మళ్లించిన ఘటనలు జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో వెలుగుచూశాయి. ఈ తరహా అక్రమాలు ఉమ్మడి మెదక్ జిల్లాల్లోనూ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అధికారులు సమగ్ర విచారణ చేస్తున్నారు. **ఎక్కడెక్కడ.. ఎలా..**

సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్, కంది, సదాశివపేట, జిన్నారం మండలాల్లో జీపీఏ(జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ)లను రిజిస్ట్రేషన్ చేసే సమయంలో నిర్దేశించిన మేర స్టాంపు డ్యూటీ (రుసుం) చెల్లించకుండా అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు.

ఎంత మేర ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారనే దానిపై ఆరా తీస్తున్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు జరిగిన జీపీఏల క్రమబద్ధీకరణలో అక్రమాలు జరిగినట్లుగా రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే కంది మండలంలో జరిగిన 86 జీపీఏలపై విచారణ ప్రారంభించి దస్త్రాలను పరిశీలిస్తున్నారు.

మండల రెవెన్యూ అధికారులు మాత్రం అన్నీ సక్రమంగానే ఉన్నట్లుగా పేర్కొంటున్నారు. సీసీఎల్ఏ యంత్రాం గం మాత్రం నిర్దేశించిన మేర సొమ్ములు జమకాలేదని పేర్కొంటూ పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

రామచంద్రాపురం, గుమ్మడిదల మండలాల్లోనూ రిజిస్ట్రేషన్ రుసుంల చెల్లింపుల్లో కొంతమేర అక్రమాలు జరిగినట్లు ఆరోపణలొస్తున్నాయి.

**అక్రమాల పాత్రధారులపై కూడా**

నాలుగు మండలాల్లో జీపీఏలను రిజిస్ట్రేషన్ చేసే సమయంలో యజమానులు నిర్దేశిత రుసుం చెల్లించినప్పటికీ మీసేవ, ఇంటర్నెట్ కేంద్రాల నిర్వాహకులు సాంకేతికత ఆధారంగా అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు భావిస్తున్నారు. దీంతో అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది.

**తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ యంత్రాంగం ఆరా**

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 2018 నుంచి జరిగిన భూముల లావాదేవీలకు సంబంధించిన దస్త్రాల పరిశీలన చేపట్టే కార్యక్రమాన్ని సీసీఎల్ఏ(భూ పరిపాలన కమిషన్) ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం చేపట్టింది. దీంతో గత వారం రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయాల్లో ఐదేళ్లుగా భూముల రిజిస్ట్రేషన్లపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. జిన్నారం, గుమ్మడిదలతో పాటు అమీన్‌పూర్, రామచంద్రాపురం, సదాశివపేట మండలాల్లో ప్రభుత్వ భూములను సైతం బైనంబర్లతో రిజిస్ట్రేషన్లు పూర్తికానిచ్చినట్లు వెలుగులోకి వచ్చాయి. వీటికి సంబంధించి రూపొందించిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



## ఏపీ హార్టికల్చర్ హబ్‌గా మారుతోంది: కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

దిల్లీ: దేశ వ్యవసాయ రంగంలో ఏపీ వాటా 10 శాతం ఉందని గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ (రాష్ట్రఅజతీఖ్రుయి రాఅఅస్త్రష్ట జష్ట్రశీబష్ట్రుఅ) తెలిపారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. PM-PRANAM పథకం కింద ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్‌ను విస్తరించడానికి నిధులు విడుదల చేయాలని కోరారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించడం వల్ల అందించే ప్రోత్సాహకాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.216 కోట్లు ఇవ్వాలని కోరారు. 2024-25లో సాగులో రసాయనాల వినియోగం 2.28 శాతం మేర తగ్గించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సేంద్రియ సాగును ప్రోత్సహిస్తున్నామని.. ఇప్పటి వరకు 18 లక్షల మంది రైతులు 8 లక్షల హెక్టార్లలో సేంద్రియ సాగుకు మొగ్గు చూపుతూ సమ్మతి తెలిపారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి సాగు అభివృద్ధి చేయడానికి రూ.200 కోట్ల మేర సాయం చేయాలని కోరారు. కోకోనట్ ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు, కర్ణాటక తరహాలో మోడ్రన్ టెండర్ కోకోనట్ మార్కెట్ల ఏర్పాటు, కొబ్బరి రైతులకు అధునాతన పద్ధతులపై శిక్షణ, నర్సరీల విస్తరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో మఖానా డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కొల్లేరు సరస్సు ప్రాంతంలో 50వేల ఎకరాల్లో మఖానా సాగుకు అనుకూల వాతావరణం ఉందని, అవసరమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ హార్టికల్చర్ హబ్‌గా మారుతోందని ఈ సందర్భంగా కేంద్రమంత్రి అన్నారు. రాష్ట్రంలో జీడిపప్పు, కాఫీ, కోకో, కొబ్బరి ఎక్కువగా పండుతోందని, రైతులకు మద్దతు ధర దక్కేలా చూస్తామన్నారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఏపీ పాత్ర కీలకమన్నారు. ఏపీ వ్యవసాయాభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఇందు కోసం కేంద్రం ప్రత్యేక బృందాన్ని నియమించిందని చెప్పారు. కేంద్ర పథకాలు, సాంకేతికత విషయంలో ఏపీకి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మత్స్యరంగం, పశుపోషణ అభివృద్ధికి సాయం చేస్తున్నట్టు చెప్పారు. సేంద్రియ సాగు, పామాయిల్ ఉత్పత్తిలో ఏపీ బాగా పనిచేస్తోందన్నారు. సేంద్రియ సాగు విస్తరణకు అన్ని విధాలుగా సాయం చేస్తామని తెలిపారు.

## అమిత్‌షాతో చంద్రబాబు భేటీ.. రాజధానికి చట్టబద్ధతపై చర్చ!





దిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత వ్యవహారంపై ఆయనతో చర్చించినట్లు సమాచారం. ఇప్పటికే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో.. దానికి సంబంధించిన అంశాలపై చర్చలు జరిపినట్లు తెలిసింది. బడ్జెట్ రెండో దశ సమావేశాల్లో బిల్లు పెట్టాలని అమిత్‌షాను సీఎం కోరినట్లు సమాచారం. దీంతో పాటు రాష్ట్రానికి చెందిన మరికొన్ని అంశాలపైనా కేంద్ర హోంమంత్రితో సీఎం చంద్రబాబు చర్చించినట్లు తెలుస్తోంది.

**నిర్మలా సీతారామన్‌తో సమావేశం...** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, వివిధ ప్రాజెక్టులకు అనుమతులు తదితర అంశాలపై ఆమెతో చర్చించారు. సీఎం వెంట రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు ఉన్నారు.

## టీటీడీ లడ్డూ కల్తీ నెయ్యి కేసులో ఈడీ ఎంట్రీ..




తిరుమల, ఫిబ్రవరి 10: శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీ ఆర్థిక అక్రమాలు, మనీ లాండరింగ్ జరిగినట్లు సిట్ విచారణలో తేలడంతో పీఎంఎల్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో వందలాది కోట్లు చేతులు మారడంపై ఈడీ విచారణ జరపనుంది. అలాగే, మనీ ట్రయల్‌పైనా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దృష్టిసారించనున్నారు. కాగా, 2019 నుంచి 2024 వరకు టీటీడీకి సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేల్చింది. ఈ నెయ్యి విలువ సుమారు రూ. 235 కోట్లుగా అంచనా. నెయ్యి కల్తీ వ్యవహారంలో విచారణ ముగించిన సిట్.. ఛార్జ్‌షీట్‌లో 36 మందిని నిందితులుగా చేర్చింది. వారిలో 12 మంది టీటీడీ ఉద్యోగులు ఉన్నారు. టెండర్లలో అక్రమాలు, హవాలా మార్గాల ద్వారా లంచాలు, అక్రమ లావాదేవీలు జరిగినట్లు విచారణలో బయటపడింది. ఈ క్రమంలో ఆర్థిక అక్రమాలు, నిధుల మళ్లింపుపై ఈడీ విచారణ చేపట్టనుంది. ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి ఈడీ.. త్వరలోనే నోటీసులు జారీ చేసి విచారించనున్నట్లు సమాచారం.




## శివరాత్రి నాటికి ఆలయాల్లో పటిష్ఠ చర్యలు తీసుకోండి: సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 10: శ్రీశైలం సహా వివిధ శివాలయాల్లో భక్తుల రద్దీ, వసతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రోజు(మంగళవారం) సమీక్ష నిర్వహించారు. శివారాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ, సౌకర్యాలపై మంత్రులు, ప్రధాన కార్యదర్శి, డీజీపీలతో పాటు ఇతర అధికారులతో ఢిల్లీ నుంచి సీఎం సమీక్షించారు. శివరాత్రి నాటికి ఆలయంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోం మంత్రి అనిత.. ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు, వసతులపై అధికారులతో పర్యవేక్షించాలని సీఎం సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా.. సరైన వసతి లభించేలా కార్యచరణ అమలు చేయాలని ఆదేశించారు. దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బంది కలిగేలా, అగౌరవపరిచేలా ఎవరూ వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. రోజు రోజుకూ దేవాలయాల్లో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు. శివరాత్రి పర్వదినం వంటి సందర్భాల్లో అన్ని విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేసేలా ఇప్పటి నుంచే పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.



## ఏపీలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయండి: సీఎం చంద్రబాబు

దిల్లీ: బెంగళూరు-చెన్నై హై స్పీడ్ రైల్ కారిడార్‌ను తిరుపతికి కనెక్ట్ చేసేలా చూడాలని కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. దిల్లీ పర్యటనలో భాగంగా అశ్వినీ వైష్ణవ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఏపీని టచ్ చేస్తూ వెళ్లే మూడు హై స్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించడంపై కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టుల పూర్తి, కొత్త రైలు మార్గాలు, సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని సీఎం కోరారు. తాడిపత్రి నుంచి ముంబయి జేఎన్‌పీటీ పోర్టుకు అరటి ఎగుమతులకు వీలుగా 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్లు కేటాయించాలన్నారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఉత్తర- దక్షిణ భారత్‌లను కలిపేలా ఇటార్సీ-విజయవాడ మధ్య ప్రత్యేక సరకు రవాణా కారిడార్ ఏర్పాటుకు సహకారం అందించాలన్నారు. ఏపీలోని పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్ పూర్- చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమ సహా ఆదివాసీ ప్రాంతాలను కనెక్టు చేసేలా వివిధ కొత్త రైల్వేమార్గాల ప్రతిపాదనల్ని ఆమోదించాలని కోరారు. విశాఖ-విజయవాడ మధ్య హైస్పీడ్, విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి-చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్ మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. హైదరాబాద్- శ్రీశైలం- మార్కాపురం కొత్త రైల్వే లైన్ ద్వారా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి కనెక్టివిటీని పెంచాలని, తిరుపతి మీదుగా విజయవాడ-బెంగుళూరు మధ్య వందేభారత్ సర్వీసును నడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వటంతో పాటు రైలు బోగీ నిర్వహణ టెర్మినల్ ఏర్పాటు చేయాలని రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు.



## కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రితో సీఎం చంద్రబాబు భేటీ

దిల్లీ: ఏపీ సీఎం చంద్రబాబు దిల్లీ పర్యటన కొనసాగుతోంది. మంగళవారం ఉదయం కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పోలవరం నిర్మాణ పురోగతితో పాటు రాష్ట్రానికి చెందిన ఇతర ప్రాజెక్టుల అనుమతులు, ఆర్థికసాయంపై చర్చించారు. జల్ జీవన్ మిషన్ పథకానికి నిధులు తదితర అంశాలపై కేంద్రమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. పలు ప్రాజెక్టులకు కేంద్ర సాయం పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు అంతర్రాష్ట్ర జల వివాదాలపై చర్చించారు.

పోలవరం ప్రాజెక్టుకు స్టాప్ వర్క్‌ఆర్డర్‌ను శాశ్వతంగా ఎత్తివేసేలా నిర్ణయం తీసుకోవాలని కేంద్రమంత్రిని చంద్రబాబు కోరారు. దీని కారణంగా అవరోధాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు కారణంగా పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు ఫేజ్-2కి ఆర్థిక సాయం అందించాలని.. భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాల్సి ఉందని సీఆర్ పాటిల్ దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు. దీనికి అదనంగా సుమారు రూ.32వేల కోట్ల నిధులు అవసరమని చెప్పారు.

గోదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు సీఎం తెలిపారు. తాగు, సాగు నీటితో పాటు పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టు ఇది అని చెప్పారు. నదుల అనుసంధానంలో భాగంగా ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసి సాంకేతిక, ఆర్థిక సాయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ, ఒడిశా మధ్య ఉన్న వంశధార జల వివాదాలను పరిష్కరించాలని కోరారు.

## తిరుమల చేరుకున్న బండ్ల గణేశ్ సంకల్ప యాత్ర



తిరుమల: సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ సంకల్ప యాత్ర తిరుమలకు చేరుకుంది. వైకాపా హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబు అరెస్టైన సమయంలో మొక్కుకున్న మొక్కును తీర్చుకునేందుకు ఆయన పాదయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. షాద్‌నగర్ నుంచి ఆయన తిరుమలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బండ్ల గణేశ్ మాట్లాడుతూ.. "23 రోజులు అడ్డంకులు లేకుండా 537 కిలోమీటర్ల మేర సంకల్ప యాత్ర చేసి శ్రీవారి సన్నిధికి చేరుకున్నా. శ్రీవేంకటేశ్వరుడిని నమ్ముకొని నష్టపోయి నవారు లేరు. నిజాయతీగా కోరుకున్నా.. నా మొర ఆలకించారు. నా జన్మలో ఇది గొప్ప ఘట్టం. ఈ జన్మంతా శ్రీవారికి సేవ చేస్తాను" అని తెలిపారు.

## మానవ అక్రమ రవాణాపై స్టింగ్ ఆపరేషన్.. అమెరికాలో తెలుగు వ్యక్తి అరెస్ట్



మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు అమెరికాలోని జార్జియాలో స్టింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలోనే ఎనిమిది మందిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన చాడ సుహరత్ రెడ్డి కూడా ఉన్నట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. గత నెలాఖరులో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనవరి 29, 30 తేదీల్లో ది శాండీ స్ప్రింగ్స్ పోలీసులు ఈ ఆపరేషన్‌ను చేపట్టారు. వ్యభిచార ముఠాలు, మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడమే లక్ష్యంగా అట్లాంటాలోని పలు హోటళ్లలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలోనే అక్రమ లైంగిక కార్యకలాపాలకు పాల్పడటం వంటి అభియోగాల కింద ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. దీనిపై మరింత సమాచారం తెలియాల్సిఉంది.

## నేటి నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు.. బడ్జెట్ అప్పుడే



ఏపీ అసెంబ్లీ సమావేశాలు రేపు ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10.30 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నజీర్ ప్రసంగించనున్నారు. దాదాపు గంటసేపు గవర్నర్ ప్రసంగం జరగనున్నట్లు సమాచారం. గవర్నర్ ప్రసంగం పూర్తయ్యాక బీఏసీ సమావేశం నిర్వహించి అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చిస్తారు. 20 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు జరగనుండగా.. ఈనెల 14వ తేదీన 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర బడ్జెట్ ను మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. కాగా.. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సీఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులతో సమావేశమై అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, సభ్యులు అడిగే ప్రశ్నలు, వాటికి సమాధానాలపై సమీక్షించరు.

## బటన్ లెస్ ఫోజులతో గుబులు రేపిన ఖుషీ

అతిలోక సుందరి శ్రీదేవి రెండో కుమార్తె ఖుషీ కపూర్ నిరంతర ఫొటోషూట్‌లతో చెలరేగిపోతోంది. ముఖ్యంగా తన సోదరి జాన్వీ కపూర్‌తో పోలిస్తే ఖుషీ స్టైల్ మరింత బోల్డ్‌గా ఉంటుందని అభిమానులు చెబుతున్నారు. ఖుషీ జెన్ జెడ్ ఫ్యాషన్ ఐకాన్‌గా దూసుకుపోతోంది. ప్రయోగాత్మక ఫ్యాషన్ సెన్స్ తో యూత్ కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటిస్తోంది. అయితే నటిగా ఖుషీ కపూర్ కెరీర్ ఆశించిన స్థాయిలో టేకాఫ్ కాలేదు. ఈ బ్యూటీ నటించిన మొదటి రెండు సినిమాలు ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన -ది ఆర్చీస్- సిరీస్‌లో ఖుషి నటించింది. కానీ నటన పరంగా మిశ్రమ స్పందన వచ్చింది. ఆ తర్వాత రెండు సినిమాల్లోను ఖుషి నటించింది కానీ అవీ కలిసి రాలేదు. ఆమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ సరసన నటించిన లవ్ యాపా (తమిళ చిత్రం లవ్



టుడే రీమేక్) థియేటర్లలో ఆశించిన ప్రభావాన్ని చూపలేకపోయింది. ఆ తర్వాత ఇబ్రహీం అలీ ఖాన్‌తో కలిసి నటించిన నదనియాన్ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద ఫెయిలైంది. బాక్సాఫీస్ వేట మొదలైంది! ఖుషీ కపూర్ ప్రస్తుతం కొన్ని క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. శ్రీదేవి నటించిన హిట్ సినిమా -మామ్- సీక్వెల్ -మామ్-2-లో ఖుషీ నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇది ఖుషీ కెరీర్‌కు చాలా కీలకం కానుంది. మరోవైపు నందమూరి బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ అరంగేట్రం చేస్తున్న సినిమాలో ఖుషీ కపూర్ హీరోయిన్‌గా నటించబోతోందని కథనాలొచ్చాయి. కానీ ఈ ప్రాజెక్ట్ గురించి తాజా అప్ డేట్ రాలేదు. మరోవైపు తమిళ నటుడు అథర్వ మురళి సరసన ఒక రొమాంటిక్ డ్రామాతో తమిళంలోకి అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తోంది. దీనికి ఆకాష్ దర్శకత్వం వహించబోతున్నారు. ఖుషీ తన తల్లి శ్రీదేవి లాగే సౌత్ సినిమాల్లో కూడా తన ముద్ర వేయాలని గట్టిగా ప్రయత్నిస్తోంది. కానీ ఇంకా ఆరంభ దశలోనే ఉంది.

## ఐకాన్ స్టార్ మూవీతో రష్మిక సరికొత్త అడుగు?

'పుష్ప 2' సినిమాతో ప్రపంచ వ్యాప్తంగా బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకున్న బన్నీ ఈ సారి దానికి మించిన సినిమాతో ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేయాలని ఫిక్స్ అయ్యాడు. ఇందులో భాగంగానే పాన్ ఇండియాకు మించి పాన్ వరల్డ్ స్టోరీతో సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేయబోతున్నాడు. బాలీవుడ్ క్రేజీ హీరోయిన్ దీపికా పదుకునే ఇందులో మెయిన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ పాన్ వరల్డ్ మూవీని కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ అత్యంత భారీ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. #AA22xA6 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ మూవీని హాలీవుడ్ స్థాయికి ఏ మాత్రం తగ్గని విధంగా హై టెక్నికల్ వ్యాల్యూస్‌తో తెరకెక్కిస్తున్నారు. సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ ఈ మూవీ కోసం పలువురు హాలీవుడ్ టెక్నీషియన్స్‌ని రంగంలోకి దించేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే భారీ క్రేజ్‌ని సొంతం చేసుకున్న ఈ మూవీలో దీపిక పదుకునే తో పాటు నేషనల్ క్రష్ రష్మిక మందన్న కూడా నటిస్తోంది. అధికారికంగా



టీమ్ ఈ విషయాన్ని వెల్లడించలేదు కానీ రష్మిక మాత్రం ఈ మూవీ సెట్‌లోకి తాజాగా అడుగుపెట్టింది. అల్లు అర్జున్, రష్మిక, -కుబేర- ఫేమ్ జిమ్ సర్భ్ లు పాల్గొనగా పలు కీలక యాక్షన్ ఘట్టాలని ఇండోర్ సెట్టింగ్స్‌లో చిత్రీకరిస్తున్నారు. అట్లీ అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్న ఈ మూవీలో బన్నీ సూపర్ హీరో తరహా క్యారెక్టర్‌లో కనిపించబోతున్నాడు. తనకు తగ్గ స్థాయిలో రష్మిక క్యారెక్టర్ కూడా ఇందులో సాగుతుందని, తనపై కూడా భారీ యాక్షన్ సీక్వెన్స్ ఉంటాయని వార్తలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా ఈ పవర్ ఫుల్ క్యారెక్టర్ కోసం రష్మికని బన్నీ రిఫర్ చేశాడని, తన క్యారెక్టర్ ఈ మూవీలో నెగెటీవ్ షేడ్స్‌తో సాగుతుందని ఇన్ సైడ్ టాక్. అదే నిజమైతే రష్మిక అటెమ్ట్ చేస్తున్న మరో సరికొత్త తరహా క్యారెక్టర్ అవుతుందని, తన కెరీర్‌కి మరో కొత్త అడుగు అవుతుందని నెట్టింట ప్రచారం జరుగుతోంది. రష్మిక క్యారెక్టర్ ఇందులో పూర్తి స్థాయిలో నెగెటివ్ షేడ్స్‌తో ఉండదని, కథలో గ్రే షేడ్స్ ఉన్న పవర్‌ఫుల్ క్యారెక్టర్ అని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. తనతో పాటు మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలక పాత్రలో నటిస్తోందని ప్రచారం జరుగుతున్నా.. పలు ఇండికేషన్‌లు కనిపిస్తున్నా తాను మాత్రం ఇందులో నటించడం లేదని చెబుతూ వస్తోంది. సాయి అభ్యాంకర్ సంగీతం అందిస్తున్నా ఈ మూవీకి జి.కె.విష్ణు సినిమాటోగ్రఫీని, రూబెన్ ఎడిటింగ్‌ని అందిస్తున్నారు.




## 'జన నాయగన్'..ఫుట్ బాల్ ఆట ఎప్పటికి ఆగేనో!



ఎవరైనా స్టార్ సినిమాలకు గుడ్ బై చెబుతున్నాడంటే ఫ్యాన్స్‌కు కాదు అది సగటు సినీ లవర్‌కు కూడా బ్యాడ్ న్యూసే. దాన్ని ఎవరూ అంగీకరించరు. వెండితెరపై దశాబ్దాల కాలం పాటు మెరుపులు మెరిపించి కోట్లాది మంది ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడమే కాకుండా తనదైన ఫ్యాన్ బేస్‌ని క్రియేట్ చేసుకున్నకోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ విషయంలోనూ ఆయన ఫ్యాన్స్, సినీ లవర్స్ ఇదే ఫీలవుతున్నారు. కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ నటించిన చివరి మూవీ -జన నాయగన్-. ఈ మూవీతో సినిమాలకు గుడ్ బై చెప్పేస్తున్నాడు. క్రియాశీల రాజకీయాల్లో ఇక నుంచి పూర్తి స్థాయిలో యాక్టీవ్ కావాలని విజయ్ నిశ్చయించుకుని సినిమాల నుంచి తప్పుకుంటున్నాడు. అయితే అతని చివరి మూవీ చుట్టూ జరుగుతున్న తంతు ఓ ఫుట్ బాల్ ఆటని గుర్తు చేస్తూ చర్చనీయాంశంగా మారింది. -జన నాగయన్- జనవరి 9న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ చేయాలని భారీ స్థాయిలో ప్లాన్ చేశారు. అయితే చివరి నిమిషంలో సెన్సార్ బోర్డ్ క్లియరెన్స్ రాకపోవడంతో రిలీజ్ ఆగిపోయిన విషయం తెలిసిందే. సీబీఎఫ్‌సీ వర్గాలు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన సింగిల్ బెంచ్ ఉత్తర్వుల్ని సవాల్ చేయడంతో ఈ మూవీ రిలీజ్ ఆగిపోయింది. ఆ తరువాత కూడా సినిమా రిలీజ్‌పై ఎలాంటి క్లారిటీ లేకపోవడంతో -జన నాయగన్- రిలీజ్ ఇప్పట్లో కష్టమేనా అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రీసెంట్‌గా సినిమా ఫైనల్ కట్ రెడీ అవుతోందని, సీబీఎఫ్‌సీ వర్గాలు కోరిన కట్స్‌కు టీమ్ సిద్ధపడిందని, ఫైనల్ కట్‌ని సీబీఎఫ్‌సీకి మరోసారి పంపించబోతోందని వార్తలు షికారు చేయడంతో ఫిబ్రవరిలో -జన నాయగన్- రిలీజ్ అవుతుందని అంతా భావించారు. కానీ ఇప్పుడు డామిట్ కథ మళ్లీ అడ్డం తిరిగినట్టుగా తెలుస్తోంది. మూవీ సెన్సార్ సర్టిఫికెట్ జారీపై సీబీఎఫ్‌సీ సైలెంట్ అయినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. చెప్పిన కట్స్‌కు అంగీకరించినా వారి నుంచి ఎలాంటి స్పందన లభించే అవకాశం లేదని గ్రహించిన మేకర్స్ ఫైనల్‌గా రివిజన్ కమిటీ ముందుకు వెళ్లడానికి రెడీ అయినట్టుగా కోలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. ఇప్పటికే అనుకున్న మార్పులు పూర్తి చేసిన టీమ్ ఈ మూవీని రివిజన్ కమిటీ ముందుకు తీసుకెళ్లారని, ఇప్పుడు బాల్ వారి కోర్టులో ఉందని ఇన్ సైడ్ న్యూస్. -జన నాయగన్- రిలీజ్ వ్యవహారం ఇప్పుడు ఫుట్ బాల్ ఆటలా ఉందని, కోర్టుకు వెళితే అక్కడి నుంచి సెన్సార్ వారి వద్దకు వెళుతోందని, అక్కడ కూడా కుదరకపోవడంతో రివిజన్ కమిటీ ముందుకు వెళ్లిందని, ఈ సినిమాతో అంతా ఓ ఫుట్ బాల్ ఆట ఆడుకుంటున్నారని తమిళ ప్రేక్షకులు, విజయ్ అభిమానులు వాపోతున్నారు. ఇప్పటికైనా -జన నాయగన్- సెన్సార్ అడ్డుగోడల్ని బద్దలు కొట్టుకుని థియేటర్లలోకి వచ్చేస్తుందా? అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరో రెండు మూడు నెలల్లో అంటే ఏప్రిల్, మే నెలల్లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో -జన నాయగన్- రిలీజ్ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సినిమా రిలీజ్ అయితే విజయ్‌కి వచ్చే మైలేజ్ వేరుగా ఉంటుందని, ఆ కారణంగానే ఈ సినిమాని తొక్కి పెడుతున్నారని తమిళనాట జోరుగా ప్రచారం జరుగుతోంది.

## ఏజెంట్ సీక్వెల్‌పై ఎందుకీ రచ్చ?



ఈ సంక్రాంతికి అనగనగా ఒక రాజు చిత్రంతో వంద కోట్ల క్లబ్బులో అడుగు పెట్టాడు యువ కథానాయకుడు నవీన్ పొలిశెట్టి. ఇప్పుడు మిడ్ రేంజ్ స్టార్‌గా ఎదిగిన అతను.. కెరీర్ ఆరంభంలో అవకాశాల కోసం చాలా కష్టపడ్డాడు. కొన్ని సినిమాల్లో క్యారెక్టర్ రోల్స్ చేసిన అతను హీరోగా మారి, బ్రేక్ అందుకున్నది ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ సినిమాతో. పెద్దగా అంచనాలు లేకుండా వచ్చిన ఆ చిత్రం.. తెలుగులో వచ్చిన బెస్ట్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్లలో ఒకటిగా నిలిచింది. ఈ సినిమా తర్వాత నవీన్ వెనుదిరిగి చూసుకోలేదు. జాతిరత్నాలు, మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి, అనగనగా ఒక రాజు చిత్రాలతో పెద్ద హిట్లు కొట్టాడు. ఐతే మధ్య మధ్యలో ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ సీక్వెల్ చేయడం గురించి అతను మాట్లాడుతూనే ఉన్నాడు. ఆ సినిమా చేస్తానంటున్నాడు. కానీ ఎంతకీ అది మొదలు కావడం లేదు. అనగనగా ఒక రాజు తర్వాత కొత్త సినిమా గురించి చర్చల్లో ఉన్నాడు నవీన్. మరోవైపు ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ దర్శకుడు స్వరూప్ కొత్త సినిమా సిద్ధు జొన్నలగడ్డ హీరోగా ఇటీవలే అనౌన్స్ అయింది. ఇలా నవీన్, స్వరూప్ ఎవరి ప్రాజెక్టుల్లో వారు బిజీగా ఉండగా.. ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ సీక్వెల్ గురించి సోషల్ మీడియాలో చర్చలు మొదలయ్యాయి. సిద్ధుతో స్వరూప్ తీస్తున్నది ఏజెంట్ సీక్వెలే అన్న ప్రచారం జరగడంతో ఆ సినిమాకు నవీనే కరెక్ట్ అంటూ కొందరు పోస్టులు పెట్టడం మొదలుపెట్టారు. మరోవైపు స్వరూప్‌తో సంబంధం లేకుండా నవీన్.. అనగనగా ఒక రాజు రైటర్ చిన్మయితో కలిసి వేరుగా ఏజెంట్-2 స్క్రిప్టు రెడీ చేసుకుంటున్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే.. నవీన్, స్వరూప్ మధ్య సంబంధాలైతే అంత బాగా లేవనిపిస్తోంది. అందుకే ఇద్దరి కలయికలో ఏజెంట్-2 రావడం సందేహంగా కనిపిస్తోంది. సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాల నేపథ్యంలో ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ నిర్మాత రాహుల్ యాదవ్ ఒక స్టేట్మెంట్ రిలీజ్ చేశాడు. ఈ సీక్వెల్ గురించి తామే అధికారికంగా ప్రకటిస్తామని... అంత వరకు ఎదురు చూడాలని పేర్కొన్నాడు. స్వరూప్ కూడా ఈ పోస్టుపై స్పందిస్తూ.. ఏజెంట్ మూవీ అందరి కష్టానికి ఫలితం అని.. ఊహాగానాలు కట్టిపెట్టి, అధికారిక ప్రకటన వచ్చే వరకు ఎదురు చూడాలని పేర్కొన్నాడు. మరి ఏజెంట్-2 అసలుంటుందా.. ఉంటే ఎవరెవరుకలిసి చేస్తారన్నది ఆసక్తికరం.

## ట్రాన్స్పరెంట్ అందాలతో హొయలుపోతున్న సంయుక్త!

ప్రముఖ హీరోయిన్ సంయుక్త గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అమాయకంగా కనిపిస్తూనే.. తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. తొలిసారి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, రానా కాంబినేషన్లో వచ్చిన 'భీమ్లా నాయక్' సినిమాలో రానా భార్య పాత్రలో నటించి ఆకట్టుకుంది. క్లైమాక్స్ లో సన్నివేశాలు ప్రేక్షకుల చేత కంటతడి కూడా తెప్పిస్తాయి. అలా తన అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న సంయుక్త మీనన్.. 2016లోనే 'పాప్ కార్న్' అనే మళయాల చిత్రం ద్వారా హీరోయిన్గా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. ఇక ఒక్కో భాషా చిత్రంలో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తూ వచ్చిన ఈమె తెలుగు, తమిళ్ , కన్నడ, మలయాళం భాషల్లో నటిస్తూ మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది. ఒకవైపు సినిమాలు చేస్తూనే మరొకవైపు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటోంది సంయుక్త మీనన్. ఈ మధ్యకాలంలో రోజుకొక గ్లామర్ ఫోటో షూట్ తో అభిమానులను ఆకట్టుకుంటుంది. అందులో భాగంగానే తాజాగా ట్రాన్స్పరెంట్ దుస్తులు ధరించి తన అందాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అందులో కొంటెగా ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరుకి అభిమానులు సైతం ఫిదా అవుతున్నారు. అంతేకాదు ఈమె ఈ ఫోటోలను షేర్ చేస్తూ.."కొంచెం సాఫ్ట్.. కొంచెం హాట్" అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ప్రస్తుతం సంయుక్త మీనన్ షేర్ చేసిన ఈ ఫోటోలకు అటు నెటిజన్స్ కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. 2022లో



కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన బింబిసారా సినిమాలో హీరోయిన్గా నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. 2023లో తెలుగు, తమిళ్ బైలింగ్వల్ గా వచ్చిన సార్ సినిమాలో టీచర్ క్యారెక్టర్ లో మరింతగా ఆకట్టుకుంది. ఇక తెలుగు, తమిళ్ అని తేడా లేకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వచ్చిన ఈమె గత ఏడాది చివర్లో నటసింహా నందమూరి బాలకృష్ణ హీరోగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన అఖండ 2లో నటించి ఆకట్టుకున్న ఈమె.. ఈ ఏడాది శర్వానంద్ సరసన 'నారీ నారీ నడుమ మురారి' సినిమాలో హీరోయిన్గా నటించింది.వాస్తవానికి ఈ సినిమా సంక్రాంతి బ్లాక్ బాస్టర్ గా నిలవాల్సి ఉంది కానీ ఈ సినిమా విడుదలైనప్పుడు అప్పటికే మెగాస్టార్ చిరంజీవి మన శంకర వరప్రసాద్ గారు సినిమా థియేటర్లలో దూసుకుపోతోంది. అటు ది రాజాసాబ్ కూడా విడుదలైంది. దీంతో ఈ చిత్రానికి థియేటర్ల కొరత ఏర్పడడంతో.. కంటెంట్ బాగున్నప్పటికీ కలెక్షన్లు మాత్రం రాలేదనే వార్తలు వ్యక్తం అయ్యాయి. ఇకపోతే సంయుక్త మీనన్ ప్రస్తుతం నిఖిల్ స్వయంభు సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా టీజర్ను 11వ తేదీన రిలీజ్ చేస్తున్నట్లు అధికారికంగా పోస్టర్ తో సహా మేకర్స్ రిలీజ్ చేశారు. కానీ సినిమాలో.. ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంతో పాటు ఒక తమిళ్, ఒక మలయాళం బాషా మూవీలలో నటిస్తున్న ఈమె అలాగే విజయ్ సేతుపతి మూవీలో కూడా నటిస్తోంది. మొత్తానికి అయితే ఒకవైపు వరుస ప్రాజెక్టులలో నటిస్తూనే మరొకవైపు ఇలా గ్లామర్ వలకబోస్తూ అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది.

## ఇదెక్కడి డ్రెస్ రా మావా..చంపేస్తోందిగా!

టాలీవుడ్ హీరోయిన్స్ లో తనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరుచున్న ఢిల్లీ బ్యూటీ రాశీ ఖన్నా. ఈమె మొదట మోడలింగ్ రంగం లో అడుగుపెట్టి తరువాత సినీ ఇండస్ట్రీలోకి వచ్చారు. తరువాత అవసరాల శ్రీనివాస్ దర్శకత్వం వహించిన 'ఊహలు గుసగుసలాడే' చిత్రంతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ భామ, తొలి సినిమాతోనే తన బుట్టబొమ్మ లాంటి అందం మరియు అభినయంతో తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకుంది. ఇక రాశీ ఖన్నా తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. మిల్కీ వైట్ బ్యూటీగా పేరు తెచ్చుకున్న ఈ ఢిల్లీ భామ, సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ప్రతి ఫొటో ఒక సెన్సేషన్. తాజాగా ఆమె ధరించిన అవుట్‌ఫిట్ చూసి కుర్రకారు ఫిదా అయిపోతున్నారు. ఆ విశేషాలు మీకోసం.. సోషల్ మీడియాలో సెన్సేషన్ - రాశీ గ్లామర్ షో: తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో రాశీ ఖన్నా షేర్ చేసిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట మంటలు పుట్టిస్తున్నాయి. విభిన్నమైన కట్స్ ఉన్న ఆ బ్లాక్ స్టైలిష్ డ్రెస్ ఆమె ఫిజిక్‌కు



పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యింది. ముఖ్యంగా ఆమె ఇచ్చిన పోజులు, ఆ క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ చూసి నెటిజన్లు ఇదెక్కడి డ్రెస్ రా మావా.. చంపేస్తోందిగా! అంటూ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. తన మేనిఛాయకు తగ్గట్టుగా సరైన కలర్ ఎంచుకోవడంలో రాశీ ఎప్పుడూ ముందుంటుంది. ఈ ఫొటోల్లో ఆమె కేవలం గ్లామర్‌నే కాదు, తనలోని ఫ్యాషన్ ఐకాన్‌ను కూడా ఆవిష్కరించింది. కేవలం గంటల వ్యవధిలోనే ఈ పోస్ట్‌కు లక్షలాది లైకులు రావడం ఆమెకున్న క్రేజ్‌కు నిదర్శనం. ఊహలు గుసగుసలాడే నుండి ఊహించని రేంజ్ వరకు రాశీ ఖన్నా సినీ ప్రయాణం 'ఊహలు గుసగుసలాడే' సినిమాతో చాలా సైలెంట్‌గా మొదలైంది. ఆ సినిమాలో హోమ్లీగా కనిపించిన ఈ బ్యూటీ, ఆ తర్వాత 'జై లవ కుశ', 'తొలిప్రేమ', 'ప్రతిరోజూ పండగే' వంటి సినిమాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తన నటనతోనే కాకుండా తన గొంతుతో పాటలు పాడి కూడా మెప్పించింది. రీసెంట్‌గా వచ్చిన 'ఫర్జీ' వంటి వెబ్ సిరీస్‌ల ద్వారా పాన్ ఇండియా లెవల్లో గుర్తింపు తెచ్చుకుంది. గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు, పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రలను కూడా అవలీలగా చేయగలనని రాశీ నిరూపించుకుంది. ఇప్పుడు వరుస తమిళ, హిందీ ప్రాజెక్టులతో ఈ ముద్దుగుమ్మ ఫుల్ బిజీగా ఉంది. స్టైలిష్ లుక్స్ వెనుక అసలు రహస్యం: రాశీ ఖన్నా తన ఫిట్‌నెస్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటుంది. తన డైట్ మరియు వర్కవుట్స్ ద్వారా తన రూపాన్ని ఎప్పటికప్పుడు సరికొత్తగా మల్చుకుంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోల్లో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.




# ఇళ్ల నుంచి పరుగులు తీసిన జనం..

హైదరాబాద్ శివారులో భూప్రకంపనలు సంభవించాయి. గాజుల రామారంలో భారీ శబ్దంతో భూప్రకంపనలు వచ్చాయి. మెట్కాన్‌గూడెం పరిసరాల్లో కూడా భూమి కంపించింది. భూప్రకంపనల నేపథ్యంలో జనాలు భయంతో ఇళ్ల నుంచి రోడ్డు మీదకు పరుగులు తీశారు. ఏం జరుగుతుందో అర్థం కాక స్థానికులు భయాందోళనకు గురయ్యారు.




హైదరాబాద్, ఫిబ్రవరి 10: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తన పేరును మార్చి పిలుస్తున్నారని ఫైర్ అయ్యారు. 'మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోండి.. మాకు అభ్యంతరం లేదు. కానీ.. మా తల్లి పెట్టిన పేరు మార్చడానికి మీరెవరు? మాపై వ్యక్తిగత విమర్శలు సరికాదు. మీకు దెయ్యాలు.. దేవతల్లా కనపడవచ్చు. మజ్లిస్‌తో మీరు కాపురం చేసినన్నాళ్లూ.. మేం నిప్పులు పోస్తాం' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయలేదని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తాను ఎవ్వరికీ దత్తపుత్రుడ్ని కాదని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఏవైనా విభేదాలుంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలో లాగడం ఎందుకని ప్రశ్నించారు. తన గురించి తప్పుగా మాట్లాడటం సరికాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌ను అరెస్ట్ చేయకుండా కిషన్ రెడ్డి పేరు మారుస్తానని అంటున్నారని కేంద్ర మంత్రి మండిపడ్డారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం అడ్డురాకుండా చూసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక గాంధీ.. ఒక్క రోజూ కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదని విమర్శించారు. తామెప్పుడూ బీఆర్ఎస్‌తో కలవలేదని తేల్చిచెప్పారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేశాయని గుర్తుచేశారు. ఇప్పుడేమీ చేయలేక తనపై ఆడి పోసుకుంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? కిషన్ రెడ్డిదా.? అనేది తెలంగాణ సమాజం ఆలోచించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తలాతోకా లేకుండా రేవంత్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ రెండేళ్లుగా మాటలతో కాలయాపన చేశారని.. ఏం చేస్తారో చేతల్లో చూపించాలన్నారు.

ఇచ్చిన మాటపై నిలబడే శక్తి లేకపోతే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి సీఎం రేవంత్ బాధ్యత వహించాలన్నారు. ఎన్నికల సంఘం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు.

# మున్సిపల్ ఎన్నికలు : భారీ పోలీసు బందోబస్తు




హైదరాబాద్ : రాష్ట్రంలో ఈ నెల 11వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికలు సాఫీగా, ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు శాఖ భారీ బందోబస్తు చేబట్టింది. ఈ ఎన్నికల కోసం ఇప్పటికే ఉన్నతాధికారులు పలుమార్లు నేరుగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశాలు నిర్వహించగా సోమవారం నాడు మరోసారి క్షేత్రస్థాయి అధికారులకు ఎన్నికల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఏడు కార్పొరేషన్లతో పాటు 116 మున్సిపాలిటీలకు బుధవారం నాడు ఎన్నికలు జరగనుండగా ఇవన్నీ గ్రేటర్ పరిధిలో లేని జిల్లాలే కావడం గమనార్హం. ఎన్నికల్లో ఎక్కడా దొంగ ఓట్లు పోలవకుండా చూడాలని క్షేత్రస్థాయి అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎన్నికల్లో ఎక్కడా అక్రమాలు జరగకుండా చూడాలని, ఓటర్ల నుంచి, ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని వారు ఆదేశించారు. నిబంధనల ప్రకారం పోలీసులు ఎన్నికల విధులను కఠినంగా నిర్వహించాలని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా వుండాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా ఏ పార్టీ కూడా ఓటర్లను ప్రభావితం చేయకుండా చూడాలని, ఎక్కడా మద్యం పంపిణీ జరగకుండా చూడాలని, అక్రమ ఆయుధాలపై కఠినంగా వుండాలని, లైసెన్స్ ఆయుధాలను పోలీసు స్టేషన్లలో సరెండర్ చేయని వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పోలింగ్ తరువాత బ్యాలెట్ పత్రాలను కౌంటింగ్ కేంద్రాలకు తరలించే క్రమంలో కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని, ఈ నెల 13వ తేదీన కౌంటింగ్ వుండడంతో అప్పటి వరకు బందోబస్తు వుండాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పోలింగ్ జరిగే సమయంలో రాజకీయ నాయకులు పరిమితికి మించి వాహనాలను వాడితే వెంటనే జప్తు చేయాలని, కౌంటింగ్ జరిగే కేంద్రాల వద్ద కూడా ఆయా పార్టీల నాయకుల హడావిడి, హంగామా లేకుండా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎన్నికల్లో గెలుపొందిన వారు బాణాసంచా కాల్చడం వంటివి చేయకుండా చూడాలని, సమస్యాత్మక గ్రామాలలో ఫలితాల తరువాత ఎలాంటి రాజకీయ గొడవలు లేకుండా ముందుగానే బందోబస్తు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఇదిలావుండగా ఎన్నికలు జరిగే ప్రాంతాలలో మంగళ, బుధవారాల్లో కల్లు దుకాణాలు, మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు మూస వేయాలని పోలీసు, అబాకరీ అధికారులు ఆదేశించారు. దీంతో పాటు ఈ ప్రాంతంలో ఒకవేళ మిలటరీ క్యాంటీలు వుంటే వాటిని కూడా మూసి వేయాలని ఆదేశించారు. కౌంటింగ్ జరిగే 13వ తేదీన కూడా వీటిని మూసివేస్తారు.




# వనస్థలిపురం వద్ద లారీని ఢీకొన్న అంబులెన్స్.. రోగులకు తీవ్రగాయాలు

హైదరాబాద్: వనస్థలిపురం ఆటోనగర్ వద్ద ఆగి ఉన్న లారీని ఓ అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్‌తోపాటు ఇద్దరు రోగులకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనంలో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను స్థానికులు అతికష్టం మీద బయటకు తీశారు. ఇద్దరు రోగులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం కారణంగా కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

# రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాల్సిందే: బండి సంజయ్




హైదరాబాద్ : రిటైర్డ్ ఉద్యోగులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. 'సీఎం గారూ... మీకు మానవత్వం ఉందా?' అని ప్రశ్నించారు. విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించకుండా మానసిక వేదనకు గురి చేయడం న్యాయమా అని ప్రశ్నించారాయన. రిటైర్డ్ అయ్యి రెండేళ్లయినా.. వారి బకాయిలను ఇంకా చెల్లించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 61 మంది విశ్రాంత ఉద్యోగులు తనువు చాలించారని.. వారి చావులకు ఎవరు బాధ్యులని లేఖలో ప్రస్తావించారు. ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులను రాష్ట్ర సర్కార్ ప్రాధాన్యం లేని కేటగిరీలుగా భావిస్తోందా అని బండి సంజయ్ నిలదీశారు. ప్రభుత్వ తీరు తెలంగాణకు మాయని మచ్చ అని విమర్శించారు. జీవితం మలి సంధ్యలో ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వమే మానసిక వేదనకు గురిచేస్తుండటం క్షమించరానిదన్నారు.

ముక్కూమొహం తెలియని వృద్ధులు కష్టాల్లో ఉంటేనే చేతనైనంత సాయం చేయాలని భావించే గొప్ప మానవతా హృదయం ఉన్న తెలంగాణ సమాజం మనదని ఆయన చెప్పుకొచ్చారు. ఉద్యోగ విరమణ చేసిన వెంటనే వారికి బెనిఫిట్స్ అన్నింటినీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని కేంద్ర మంత్రి ఫైర్ అయ్యారు. దీనిని తక్షణమే అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుని వారి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష చేసేందుకు వెనకాడబోమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి ఇప్పటికైనా నిజాలు చెప్పాలి: కవిత




హైదరాబాద్: మున్సిపల్ బూతుల వర్షం ఆగిపోవడం సంతోషంగా ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం చూశాక.. పార్టీ గుర్తులు లేకుండా ఎన్నికలు జరిగితే బాగుండేదని కవిత అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మంచినీరు, పారిశుధ్యం లోపిస్తోందని, ఈ అంశాలపై ఎన్నికల ప్రచారంలో చర్చ జరగలేదని ఆమె వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. కేవలం సిద్ధిపేట మున్సిపాలిటీకి మాత్రమే నిధులు మంజూరు అయ్యాయని.. హరీష్ రావు, ముఖ్యమంత్రికి మధ్య ఏముందో అర్థం చేసుకోవాలని కవిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంపద సృష్టించకుండా.. ఆస్తులను అమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 50 శాతం మంది రైతులకు ఇంకా రుణమాఫీ చేయలేదని వెల్లడించారు. రుణమాఫీపై చర్చకు తాము సిద్ధమని.. సచివాలయాలనికి రమ్మంటారా.. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు రమ్మంటారా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా నిజాలు చెప్పాలన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు జాగృతి తరపున వినతి పత్రం అందిస్తామని కవిత తెలిపారు. లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా 12వ తేదీన బంద్‌కు జాగృతి మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఎంఐఎం పార్టీ పొద్దు తిరుగుడు పువ్వులా.. ఎవరు అధికారంలో ఉంటే వారి వెంట ఉంటుందని సెటైర్లు వేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాయల తెలంగాణకు ఒవైసీ బ్రదర్స్ మద్దతు ఇచ్చారని, రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ మనిషి అన్న ఒవైసీ.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సపోర్ట్ చేశారని కవిత విమర్శించారు.

# వాన్‌పిక్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ



దిల్లీ: వాన్‌పిక్ ప్రాజెక్ట్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలన్న పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థ నమోదు చేసిన అభియోగాలను సీబీఐ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుందని.. దానికి గల కారణాలు చెప్పలేదంటూ వాన్‌పిక్ యాజమాన్యం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేయడంతో వాన్‌పిక్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై జస్టిస్ సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ.. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీనిపై విచారణకు నిరాకరిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

# మున్సిపల్ ఎన్నికలు... సెలవు ప్రకటించిన సర్కార్..




హైదరాబాద్, ఫిబ్రవరి 10: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేపటి (బుధవారం) పోలింగ్ రోజును సెలవుగా ప్రకటించింది సర్కార్. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని ఫ్యాక్టరీలు, షాపులు, పరిశ్రమలకు సెలవు వర్తించనుంది. అంతేకాకుండా, మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు ఈ సెలవు వర్తించనుంది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో మాత్రమే ఈ సెలవు వర్తించనుంది. తెలంగాణ వ్యాప్తంగా ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరుగనుంది. మొత్తం 12,930 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎన్నికల కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,301 బాలెట్ బాక్సులను ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. రేపు (ఫిబ్రవరి 11) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 13న ఫలితాలను ప్రకటించనున్నారు. పోలింగ్ కోసం ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలింగ్ సమయంలో మద్యం షాపులు మూసేయడంతో పాటు, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోనున్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

# బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య.. చట్టపరమైన చర్యలకు ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ ..



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలోని 6వ వార్డు నుంచి బీజేపీ తరపున పోటీ చేస్తున్న ఎస్టీ అభ్యర్థి ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ సంఘటనను ఎంపీ లక్ష్మణ్ రాజ్యసభలో ప్రస్తావించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో ఇలాంటి దారుణం జరగడం దారుణమన్నారు. 'గెలవడం ఖాయం.. గెలిచిన తర్వాత కూడా నన్ను అధికార పార్టీ వేధిస్తుందని భార్యతో స్పష్టంగా చెప్పి.. ఎస్టీ అభ్యర్థి ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నాడు' అని ఎంపీ తెలిపారు. ఈ దారుణ సంఘటనను సభా ముఖంగా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినట్లు ఎంపీ చెప్పారు. బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీ.. ఈ విషయంపై సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ రకంగా ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసేలా దురాగతాలకు పాల్పడటం తీవ్ర అభ్యంతరకరమని ఎంపీ లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మక్తల్ బీజేపీ అభ్యర్థి ఆత్మహత్యపై తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి స్పందించారు. బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మహదేవప్ప సూసైడ్ లెటర్ రాయలేదని, పూర్తి విచారణ జరిపి.. వాస్తవాలు బయటపెడతామని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com